నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
కర్నూలు నంద్యాల
శనివారం | 20 డిసెంబరు 2025
పేజీలు 8





# గుట్టుగా ‘గంజాయి’ సాగు

- చిప్పగిరి మండలం డేగలపాడులో బయటపడ్డ పంట
- అంతర పంటగా గంజాయి సాగుకు దిగిన శివయ్య అనే రైతు
- మాదకద్రవ్యాల కేంద్రంగా కర్నూలు జిల్లా
- మత్తులో ఊగిపోతున్న యువత
- రాష్ట్రాన్ని ఉలిక్కిపడేలా చేసిన గంజాయి సాగు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు, ఎక్సైజ్ అధికారులు



ట్రాక్టర్ పై గంజాయిని తరలిస్తున్న దృశ్యం



పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నిస్తున్న ముద్దాయిలు



అంతర్ పంటగా వేసిన గంజాయి సాగును పరిశీలిస్తున్న పోలీసులు

**హొలహర్వి,కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో** : కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం చిప్పగిరి సమీపంలోని డేగులపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో పొలంలో ‘గంజాయి’ సాగును పోలీసులు గుర్తించారు. ఇప్పటి వరకు ఇతర దేశాల నుండి, ఇతర రాష్ట్రాల నుండి గంజాయి దిగుమతి అవుతోందన్నది అధికారిక సమాచారం. అయితే, కళ్లెదుటే గంజాయి సాగు చేస్తున్నారన్న విషయం బయటకు రావడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. కంది, మిరప పంటల మధ్య అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నారన్న విషయం వెలుగు చూడడంతో కర్నూలు జిల్లా ఉలిక్కిపడింది. ఎవరి కంట పడకుండా కంది, మిరప పంటల్లో అంతర పంటగా గంజాయిని సాగు చేస్తుండడం శుక్రవారం వెలుగు చూసింది. చిప్పగిరి మండలం మారుమూల ఫ్యాక్షన్ గ్రామమైన డేగులపాడు గ్రామంలో దేవాదాయ శాఖకు చెందిన సర్వే నెంబర్ 176లో 30 ఎకరాలను స్థానిక రైతులు సాగు చేసుకుంటున్నారు. ఇందులో ఇదే గ్రామానికి చెందిన ఉనేబాది శివయ్య అనే రైతు 18 ఎకరాల్లో కంది, మిరప పంట సాగు చేసుకుంటున్నారు. ఇందులోనే అంతర పంటగా గంజాయి సాగు చేపట్టారు. ఒక పొలంలో పెద్ద ఎత్తున గంజాయి సాగు చేస్తున్న

మిగతా 2లో

# విజయ డెయిరీ..హైటెన్షన్

- ముత్యాలపాడు సొసైటీ ఎన్నిక పై వివాదం
- డెయిరీ వద్ద భారీ బందోబస్తు
- ఎన్నిక జరగలేదంటున్న యాజమాన్యం
- విచారణ 29న వాయిదా
- మా వాదన వినాలంటున్న సొసైటీ



విలేఖరులతో మాట్లాడుతున్న భూమా విఖ్యాత్‌రెడ్డి

**నంద్యాల,మేజర్‌న్యూస్ బ్యూరో** : నంద్యాల విజయ డె యిరీ వద్ద శుక్రవారం హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఇప్పటికే గత రెండు రోజుల నుంచి డెయిరీ ఎదుట తెలుగునాడు కార్మిక సంఘం నిరసన చేపట్టిన విషయం పాఠకులకు విధితమే. ముత్యాలపాడు సొసైటి ఎన్నికపై వివాదం నెలకొంది. ఈ క్రమంలోనే శుక్రవారం విచారణ కు హాజరు కావాలని సొసైటి సభ్యులకు యాజమాన్యం నోటిసులను జారీ చేసింది. విచారణకు సొసైటి సభ్యులతోపాటు ఆళ్ళగడ్డ టీడీపీ యువ నాయకుడు

మిగతా 2లో

# కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

- మేయర్ పై మండిపడ్డ వైసీపీ కార్పొరేటర్లు
- కమీషనర్ వ్యవహార శైలి పై మండిపడ్డ కార్పొరేటర్లు
- అభివృద్ధిని అడ్డుకునేందుకే సభ వాయిదా వేశారు
- సమావేశాన్ని బహిష్కరించిన వైసీపీ కార్పొరేటర్లు

**కర్నూలు (కెఎంసి), మేజర్‌న్యూస్ :** మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సాధారణ సమావేశం కోరం లేక వాయిదా పడింది. ప్రతి మూడు నెలలకోసారి నగర అభివృద్ధి కోసం చర్చించి

మిగతా 2లో



మేయర్‌ను నిలువరిస్తున్న వైసిపి కార్పొరేటర్లు

# ‘జగన్ దీక్ష’లో మేయర్

- ఆయన సీఎం అయ్యేంత వరకు నీలం తుస్తులు..గడ్డం పెంచాలని నిర్ణయం
- గతంలోనూ సీఎం కావాలని మొక్కు

**సూర్య ప్రతినిధి, కర్నూలు :** కర్నూలు మేయర్ బివై రామయ్య మాజీ ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి కోసం దీక్షకు దిగారు. జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్య మంత్రి అయ్యేంత దాకా ఆయన దీక్ష చేయనున్నారు. ప్రతి ఏటా అయ్యప్పమాల ధరించే బివై రామయ్య కొత్తగా చేపట్టిన ‘జగన్’ దీక్ష కోసం నీలం దుస్తులు ధరిస్తున్నారు. అంతే కాదు జగన్ సిఎం అయ్యాకే క్షవరం చేయించుకోవాలని, గడ్డం పెంచాలని ఆయన నిర్ణయించుకున్నారు. నిత్యం జగన్మోహన్‌రెడ్డి జపం చేసే రామయ్య ప్రతి ఏటా జగన్, ఆయన సతీమణి భారతిరెడ్డిల జన్నదినోత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా మార్చుకున్నారు. ఇటీవలే భారతిరెడ్డి జన్మదినం సందర్భంగా తాను జగన్ దీక్ష తీసుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న రామయ్య ఆ పార్టీని కాదని వైఎస్సార్సీపిలో చేరిన తర్వాత ఆర్థికంగా వెనుకబడ్డా తనకు మంచి స్థానం దక్కిందన్న విశ్వాసాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నారు. వైకాపా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన రామయ్యకు పార్టీ కర్నూలు మేయర్ స్థానాన్ని కట్టబెట్టింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కర్నూలు ఎంపిగా పోటీ చేసేందుకు విముఖత చూపి

మిగతా 7లో



నీలం దుస్తుల్లో గడ్డం పెంచి దీక్షలో ఉన్న మేయర్ బివై.రామయ్య

సూర్య

శనివారం 20 డిసెంబరు 2025

# గుట్టుగా 'గంజాయి' సాగు

(మొదటి పేజి తరువాయి)

సమాచారం రావడంతో చిప్పగిరి ఎస్సై సతీష్ కుమార్ ఆ గ్రామానికి వెళ్లి తనిఖీ చేసి సమాచారాన్ని సిఐ రవి శంకర్‌రెడ్డి, ఎక్సైజ్ సిఐ లలితాదేవిలకు అందించారు. దీంతో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా ఆ పొలంపై దాడి చేసి నిలువెత్తు కంది, మిరప పంటల మధ్య నిలువెత్తున పెరిగిన గంజాయి మొక్కలను చూసి అవాక్కయ్యారు. కూలీలతో గంజాయి మొక్కలను తొలగించారు. తొలగించిన పంటను ట్రాక్టర్లలో పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇప్పటి వరకు గంజాయి పంట కోత కోయలేదని, ఇంకా లేత దశలోనే ఉందని పోలీసు అధికారులు వెల్లడించారు. ఎవరి ప్రమేయంలో ఇంత పెద్ద ఎత్తున గంజాయి సాగు చేస్తున్నారన్న వైపు పోలీసులు విచారణ చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి ప్రాథమిక సమాచారం మాత్రమే వెలుగులోకి వచ్చింది. కర్నూలు జిల్లా చివరి ప్రాంతంలో కర్నాటకకు ఆనుకుని ఉన్న ఆలూరు నియోజకవర్గంలో అసాంఘిక శక్తులు ఆడింది ఆట పాడింది పాటగా మారింది. పేకాట క్లబ్‌లు, నకిలీ మద్యం తయారీ కేంద్రాలుగా ఆలూరు, చిప్పగిరి, హోళగుంద తదితర మండలాలు మారిపోయాయి. గతంలో ఇక్కడ పోలీసు అధికారులపైనే పేకాట, మద్యం క్లబ్ నిర్వాహకులు దాడులు చేసిన విషయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అప్పట్లో రాష్ట్ర మంత్రి కుటుంబం పేకాట, మద్యం క్లబ్‌లను విచ్చలవిడిగా నడిపిస్తోందన్న ఆరోపణలు వచ్చాయి. కానీ, ఆరోపణలేవీ నిర్ధారణ కాలేదు. ఆలూరు నియోజకవర్గం కొన్ని ఏళ్లుగా అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందన్నది మాత్రం వాస్తవం.

మాదక ద్రవ్యాలను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఈగల్' పేరుతో ఒక సెల్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇటీవలి కాలంలో ఈగల్ అధికారులు మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్న మాఫియాను అరికట్టేందుకు ప్రయత్నిస్తున్నా గంజాయి ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా లభిస్తోంది. కర్నూలు జిల్లాలో కూడా గంజాయితో పాటు మాదకద్రవ్యాల వినియోగం బాగా పెరిగినట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లా కేంద్రమైన కర్నూలు నగరంలో మాదకద్రవ్యాల మాఫియా పెద్ద ఎత్తున వాటిని సరఫరా చేస్తోంది. ఇటీవలి కాలంలో కోడుమూరు, ఎమ్మిగ నూరు, నంద్యాల తదితర ప్రాంతాల్లో పోలీసులు పెద్ద ఎత్తున గంజాయిని, వాటిని సరఫరా చేస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి కేవలం సరఫరా వరకే పరిమితం కాలేదని, ఏకంగా ఆ పంటనే కర్నూలు జిల్లాలో సాగు చేస్తున్నారన్న విషయం వెలుగు చూడడంతో మాదకద్రవ్యాల హబ్‌గా కర్నూలు జిల్లా మారిపోయిందా? అన్న అనుమానాలు తలె త్తుతున్నాయి. పోలీసులు నియంత్రించేందుకు ఎంత ప్రయత్నిస్తున్నా మాదకద్రవ్యాల సరఫరా ఆగడం లేదన్నది వాస్తవం. దీంతో యువత మత్తు మందులో ఊగుతోంది. గంజాయి లాంటి డ్రగ్స్ సరఫరా చే స్తున్న వారెవరు అనేది మాదకద్రవ్యాలకు బానిసలైన వారికి పక్కా సమాచారం ఉన్నా పోలీసులకు మాత్రం వారు చిక్కడం లేదు. ఇక, నిషేధిత గుట్కా వ్యాపారం మూడు పూవులు ఆరుకాయలుగా మారింది. ఎక్కడ పడితే అక్కడ బహిరంగంగానే గుట్కా, పాన్‌పరాగ్ విక్రయిస్తున్నా చిన్న వ్యాపారులపై దాడులు చేసి కేసులు పెడతామంటూ భయపెట్టడమే తప్ప అసలు మాఫియాను పోలీసులు పట్టుకోలేకపోతున్నారు.

# 'జగన్ దీక్ష'లో మేయర్

(మొదటి పేజి తరువాయి)

తెదేపాలో చేరిన మాజీ మంత్రి జయరాం స్థానంలో పోటీ చేయాలంటూ చివరి క్షణంలో పార్టీ ఇచ్చిన ఆదేశాలను రామయ్య వెనుకడుగు వేయకుండా పాటించారు. ఈయన 2019 ఎన్నికలకు ముందు కూడా ఇదే తరహాలో జగన్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుని దీక్ష చేపట్టారు. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాతనే దీక్షను విరమించి గడ్డం చేయించి సాధారణ దుస్తుల్లో ప్రజలకు కనిపించారు. అయితే 2024ఎన్నికల్లో దురదృష్టవశాత్తు వైసిపి ఓడిపోవడంతో జగన్ పదవి నుండి దిగిపోవాల్సి వచ్చింది. ఆయన మళ్లీ ముఖ్య మంత్రి కావాలన్నదే తన ఆకాంక్ష అని మేయర్ బివై రామయ్య సూర్య ప్రతినిధితో అన్నారు. తాను ఆర్థికంగా బలవంతుడిని కాదని, తనకు దైవ భక్తి ఎక్కువ అని కాబట్టే తాను నమ్మిన పద్ధతిలో దీక్ష చేస్తున్నానని స్పష్టం చేశారు. రాబోయే 2029ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్ పదవీ బాధ్యతలు చేపట్టడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# విజయ డెయిరీ..హైటెన్షన్

(మొదటి పేజి తరువాయి)




ఎండి చాంబర్‌లో భూమా విఖ్యాత్‌రెడ్డి, డెయిరీ వద్ద పోలీసు బందోబస్తు

భూమా విఖ్యాత్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన డెయిరీ వద్దకు వస్తున్న విషయం తెలియడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. డెయిరీ ఎండి చాంబర్‌లో విఖ్యాత్‌తోపాటు సొసైటి సభ్యులు కూర్చున్నారు. ఎండి ప్రదీప్‌కుమార్‌తోపాటు చైర్మెన్ శుక్రవారం డెయిరీకి రాలేదు. డెయిరీలో నెలకొన్న వివాదాలకు త్రిసభ్య కమిటిని యాజమాన్యం ఏర్పాటు చేసుకుంది. వివాదాల పరిష్కార కమిటి చైర్మెన్‌గా డైరెక్టర్ గంగుల విజయ సింహారెడ్డితోపాటు మరొకరు చైర్మెన్ చాంబర్‌లో కూర్చున్నారు. వివాదంపై నోటీసుకు సమాధానం ఇచ్చేందుకు వచ్చామని, అక్కడి నుంచే భూమా విఖ్యాత్ ఎండితో మాట్లాడారు. ఆయన రాత పూర్వకంగా రాసి కమిటికి ఇవ్వాలని చెప్పినట్లు తెలుస్తోంది. కమిటిలో గంగుల విజయ సింహారెడ్డి ఉండటంతో హైటెన్షన్ వాతావరణం ఏర్పడింది. అనంతరం ఈ నెల 29కి విచారణ వాయిదా వేస్తున్నట్లు పరిష్కార కమిటి నోటిసులు అందించింది. డెయిరీ ఎదుట భూమా విఖ్యాత్‌రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ తన ఎన్నిక అక్రమమంటూ నోటిసులపై వివరణ ఇవ్వడానికి వస్తే ఎవరూ లేరన్నారు. సొసైటిని ఎలా రద్దు చేస్తారని ప్రశ్నించారు. ప్రస్తుత చైర్మెన్‌తోపాటు డైరెక్టర్లు ఎలా ఎన్నుకుంటారని ప్రశ్నించాలని వచ్చానన్నారు. త్రిసభ్య కమిటి అంటూ నన్ను ఒక రూమ్‌లో కూర్చొపెట్టి నోటిసులు ఇచ్చారన్నారు. నేను మాట్లాడటానికి వస్తే నాతో మాట్లాడే ధైర్యం లేనప్పుడు ఎందుకు నోటిసులు ఇచ్చారని ప్రశ్నించారు. డెయిరీలో ఎన్నో అక్రమాలు చేస్తున్నారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీకి చెందిన వారయితే సొసైటిలను రద్దు చేయడం, ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తమను ఇబ్బందులకు గురి చేయాలంటే తమపై చూపాలని అనవసరంగా రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. అనంతరం డెయిరీ ఎదుట నిరసన తెలుపుతున్న శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. ఇది ఇలా ఉంటే యాజమాన్యం వాదన మరోలా ఉంది. ముత్యాలపాడు సొసైటి ఎన్నిక జరగలేదని చెబుతుంది. ఎన్నిక జరుగకుండా వారంతకు వారే కో ఆప్షన్ పద్ధతిలో భూమా విఖ్యాత్‌రెడ్డిని ఎంపిక చేసి చైర్మెన్‌గా ఎన్నుకున్నారని చెబుతున్నారు. భూమా విఖ్యాత్‌రెడ్డిని చక్రవర్తులపల్లె సొసైటి అధ్యక్షులుగా ఉన్నప్పుడే నిధుల దుర్వినియోగంపై సొసైటిని రద్దు చేయడమే కాకుండా ఆయనను డిఫాల్టర్‌గా ప్రకటించినట్లు యాజమాన్యం స్పష్టం చేస్తోంది. డిఫాల్టర్‌ను ఎలా ఎన్నుకుంటారని, అసలు సొసైటి ఎన్నికలు జరుగకుండా కమిటిని ఎలా ప్రకటిస్తారని విచారణకు రావాలని నోటిసులు జారీ చేసిన విషయం వాస్తవమేనన్నారు. సొసైటి సభ్యులు వివాదాల పరిష్కార కమిటి ఎదుట హాజరై తమ వాదన వినిపించాలని యాజమాన్యం చెబుతుంది. ఇరువర్గాల వాదనలు ఒక్కొక్క విధంగా ఉండటంతో పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాలతో మాట్లాడారు. సీఐలు ఈశ్వరయ్య, సుధాకర్‌రెడ్డిలు భూమా, గంగులతో మాట్లాడి విచారణను ఈ నెల 29వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు నోటిసులను జారీ చేశారు.

# సగరుల అభివృద్ధికి ఐకమత్యంతో ముందుకెళతాం

- మంత్రాలయం తాలూకా సగర సంఘం అధ్యక్షుడు కల్లుకుంట రమేష్
- ఏకగ్రీవంగా ఎన్నికైన రమేష్ ను ఘనంగా సన్మానించిన ఆదోని సగర(ఉప్పర) సంఘం నాయకులు

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** సగరులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగాఎదిగేందుకు వారిఅభివృద్ధికి ఐకమత్యంతో ముందు కెళతాం' అని నూతనంగా ఎన్నికైన మంత్రాలయం తాలూకా సగర (ఉప్పర)సంఘం అధ్యక్షుడు కల్లుకుంట ఉప్పర రమేష్ అన్నారు. ఆయన నూతన తాలూకా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడ ం పట్ల శుక్రవారం ఆదోని సగర సంఘం నాయకులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు. సామాజిక స్పృహ, సేవా దృక్పథం, ఎంతో నిబద్ధత ఉన్న మంచి వ్యక్తి 'కల్లుకుంట రమేష్'ను సగర సంఘం తాలూకా అధ్యక్షుడిగా ఎన్నుకోవడం మంచి శుభ పరిణామం అం టూ కొనియాడారు. ఈ సందర్భంగా గోనబావి గోపాల్ ను అదే విధంగా రమేష్‌ను వారు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈసందర్భంగా కల్లుకుంట రమేష్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని మంత్రాలయం, పెద్దకడబూరు, కోసిగి, కౌతాళం మండలాల పరిధిలోని గ్రామాల్లో ఉన్న ఉప్పర బాంధవుల



గోనబావి గోపాల్, కల్లుకుంట రమేష్ లను సన్మానిస్తున్న దృశ్యం

అందరినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. అంతేకాకుండా కర్నూలు జిల్లా సగర సంఘం అధ్యక్షుడు గోనబావి గోపాల్, సగర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యూకే వీరేంద్ర, నియోజకవర్గం గౌరవ అధ్యక్షుడు ఉప్పర చిన్న అయ్యన్న మిగతా నాయకులందరి సహకారంతో మంత్రాలయం నియోజకవర్గ సగరుల సమస్యల పరిష్కారానికి తాము అహర్నిశలు కృషి చేస్తామ ని రమేష్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉప్పర గురుస్వామి, హనుమంతరావు, వీరేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# 5 ఏళ్ల లోపు పిల్లలందరికి పోలియో చుక్కలు వేయించండి

**చాగలమర్రి,మేజర్‌న్యూస్ :** ఈ నెల 21 న నిర్వహిస్తున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో తల్లిదండ్రులు 0-5 సంవత్సరాల లోపు పిల్లలందరికి పోలియో చుక్కలు వేయించాలని వైద్యులు తస్లీమా సుల్తానా కోరారు. మండలంలోని పెద్దవంగలి గ్రామంలో విద్యార్థులతో కలసి గ్రామంలోని పలు వీధుల్లో పల్స్‌పోలియో పై ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామంటూ నినాదాలుచేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి కవిత,ఏఎన్ఎం నూర్జహాన్,ఆశా కార్యకర్తలు రజని,పద్మావతి,విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే చాగ లమర్రిలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో తాహిర్ హుస్సేన్




ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆధ్వర్యంలో పల్స్ పోలియోపై ర్యాలీ నిర్వహించారు.

# సిఎం చంద్రబాబుకు అవార్డు రావడం ప్రజలకు గర్వకారణం

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఎకనామిక్ టైమ్ ప్రతిష్టాత్మక మైన బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ 2025 అవార్డు ప్రకటించడం రాష్ట్ర ప్రజలకు గర్వకారణ మని నంద్యాల 38వ వార్డు ఇన్‌చార్జ్ తాటికొండ బుగ్గరాముడు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల వైసీపీ అస్థవ్యస్థ పాలనలో అన్ని రంగాల్లో వెనుకబడిన రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమపాలనలో అమలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రపంచ స్థాయి నాయకుడు అన్నారు. 18 నెలల పాలనలో రూ.10.70 లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చారని తెలిపారు. పారిశ్రామికంగా అభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ఘనత చంద్రబాబుకు దక్కుతుందని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన చంద్రబాబు ఇప్పుడు మన రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలుపుతారని అన్నారు. రాష్ట్రాన్ని ఐటి రంగంలో మొదటి స్థానంలో ఉంచేందుకు కృషి చేస్తున్న మంత్రి నారా లోకేష్‌కు ప్రజలు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అభినందనలు తెలిపారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు బుగ్గరాముడు

# కార్యకర్తలకు అండగా ఉంటాం

-మాజీ ఎమ్మెల్యే శ్రీ కె. చెన్నకేశవ రెడ్డి

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** వైసీపీ కార్యకర్తలకు అండగా ఉంటా మని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పేర్కొన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న పార్టీ కార్యక ర్తలను పరామర్శించారు. కర్నూలు కిమ్స్ ఆసుపత్రిలో పట్టణానికి చెంది న పార్టీ కార్యకర్త రాముడు, కడిమెట్ల గ్రామానికి చెందిన నాగార్జునరెడ్డిల ను అయన పరామర్శించారు. సంబ



ంధిత వైద్యులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సహాయం గురించి, ప్రస్తుత ఆరోగ్య స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందిం చాలని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడతమని పేర్కొన్నారు.

# నిండు జీవితానికి రెండు చుక్కలు - డాక్టర్ నేగల హుసేని

**దొర్నిపాడుమేజర్,న్యూస్ః** నిండు జీవితానికి రెండు చుక్కలు ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని డబ్ల్యు కొత్తపల్లె ప్రాథమిక వైద్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నేగల హుసేని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన జరుగు పల్స్ పోలియో కాఆర్యక్రమాన్ని పురస్కరించుకొని డబ్ల్యు కొత్తపల్లె గ్రామంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు , వైద్య సిబ్బంది పోలియో చుక్కలపై ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రరధాన కూడలిలో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక వైద్య కేంద్రం పరిధిలో ఐదు సంవత్సరాలలోపు పిల్లలు 1784మంది పిల్లలు ఉన్నారని వారికి 15 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని 21వ తేదీ ఉదయం 7గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు మీ సమీపంలోని



పల్స్ పోలియోపై ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ నేగల హుసేని

పోలియో కేంద్రంలో మీ పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వైద్య కేంద్రం డాక్టర్ నేగల హుసేని, ఎంపిహెచ్ఈఒ బాబయ్య, వైద్య సిబ్బంది , ఆశా కార్యకర్తలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# పోలియో రహిత సమాజాన్ని నిర్మించుకుందాం

**ప్యాపిలి వైద్యాధికారి డాక్టర్ రాహుల్**

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ః** రాబోయే తరాలను పోలియో మహమ్మారి నుండి రక్షించుకొని, పోలియో రహిత సమాజాన్ని నిర్మించుకునేందుకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని ప్యాపిలి వైద్యాధికారి డాక్టర్ రాహుల్ అన్నారు. పల్స్‌పోలియో పైన శుక్రవారం పట్టణంలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించి అనంతరం పోలియో మహమ్మారిని తరిమికొడుదామంటూ వైద్య సిబ్బంది, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో



ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్యాపిలి వైద్యాధికారి డాక్టర్ రాహుల్

వైద్యాధికారి రాహుల్ మాట్లాడుతూ ఈనెల 21వ తేది ఆదివారం మీ గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కేంద్రాలలో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు రెండు పోలియో చుక్కలు వేయించి పోలియోను నిర్మూలించాలని, నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు అన్నారు. కావున ప్రజలు, చిన్నారుల తల్లిదండ్రులు పోలియో చుక్కల కార్యక్రమాని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి రాఘవేంద్రగౌడ్, పర్యవేక్షకులు సరోజ, మల్లికార్జున, అబ్దుల్లా, ఏఎన్ఎంలు అరుణబాయి, శోభా, వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ విస్తరణే లక్ష్యంగా పనిచేయాలి

**- డిఆర్డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి**



మాట్లాడుతున్న డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** ప్రకృతి వ్యవసాయ విస్తరణే లక్ష్యంగా మండల, గ్రామ స్థాయిలో ప్రతి ఒక్కరు పనిచేయాలని డిఆర్డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మహిళా మండల సమాఖ్య కార్యాలయంలో వ్యవసాయ శాఖ, వ్యవసాయ అనుబంధ శాఖలు, రైతు సాధికార సంస్థ, సెర్ప్-వెలుగు సంస్థల సమన్వయంతో మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామ సంఘ సమావేశంలో ప్రకృతి వ్యవసాయ అంశాన్ని అజెండాగా తీసుకోని చర్చించాలన్నారు. చిన్న, సన్నకారు రైతులు, పొదుపు సంఘాల సభ్యులతో ప్రకృతి వ్యవసాయాన్ని అమలు చేయడమే కాకుండా ప్రతి ఇంట్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పెరటి తోటల ఏర్పాటు చేసుకొనేలా ప్రోత్సహించాలన్నారు. నేషనల్ మిషన్ నేచురల్ ఫార్మింగ్‌గా జాతీయ స్థాయిలో అమలు చేయడం సంతోషకరమని, ఈ విషయంలో మన రాష్ట్రం ఇతర రాష్ట్రాలకుఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. పొదుపు సంఘాల మహిళలు ప్రకృతి వ్యవసాయాన్ని రోల్‌మోడల్‌గా అభివృద్ధి చేయాలని, కొత్తగ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింపజేసేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలన్నారు. ప్రకృతి, వ్యవసాయం, హెల్త్ అండ్ న్యూట్రేషన్ కార్యక్రమాలకు ప్రజలకు వివరించడమైందన్నారు. రైతులు రసాయన ఎరువులైన యూరియా, డిఎపి లాంటి వాటిని ఉపయోగించే వ్యవసాయం కాకుండా తక్కువ పెట్టుబడులతో సేంద్రియ ఎరువులతో చేసే ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు చేయాలని అన్నారు. ప్రకృతివ్యవసాయానికి వ్యవసాయ శాఖ, దాని అనుబంధ శాఖలు అందిస్తున్న ప్రభుత్వ పథకాల గురించి వివరించామన్నారు. ప్రతి ఒక్కరు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపుతూ ప్రకృతి వ్యవసాయం విస్తరించేలా బాధ్యతగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ఏరియా కోఆర్డినేటర్ పుల్లయ్య, ఎపిఎం కాశీశ్వరుడ, ఎఇఓ సతీష్, ఉద్యాన శాఖ అధికారి మురళీకృష్ణ, అడిషనల్ డిపిఎం సలాం, ఫార్మర్ మాస్టర్ ట్రైనర్లు రమేష్ నాయక్, సయ్యద్ బాష, ఎన్ఎఫ్ఎఫ్ అన్వర్, మండల అధికారులు, వెలుగు సిసిలు, విఓఏలు, ఐసిఆర్పిలు, మండల సమాఖ్య మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేయడం తగదు : ఏపీటీఎఫ్

**నంద్యాలటౌన్,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయులను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేయడం తగదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యులు కె. సాంబశివుడు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు ప్రభుత్వ చర్యలను ఖండించారు. శుక్రవారంస్థానికజిల్లా కార్యాలయంలోజరిగిన ఏపీటీఎఫ్ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థుల వంద రోజుల ప్రణాళికలో భాగంగా రెండవ శనివారం, ఆదివారం, పండుగలు మరియు సెలవుల్లో కూడా విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించడం అలాగే పరీక్ష పూర్తయిన మరుసటి రోజు మార్కులను ఆన్లైన్లో నమోదు చేయాలని చెప్పడంతో ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఇది ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మంచిది కాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయులపై వివిధ రకాల యాప్ ల భారము మరియు బోధనేతర పనుల భారం తగ్గించాలని, అలాగే వందరోజుల ప్రణాళికలో పాల్గొనే ఉపాధ్యాయులకు సీసీఎల్ ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పదవ తరగతి ఫలితాలకు ఉపాధ్యాయులను మాత్రమే బాధ్యులను చేయడం సరైన విధానం కాదని వారన్నారు. పాఠశాల పని దినాలు 220 ఉన్న రెండవ శనివారం తప్పనిసరిగా పని చేయాలనే నిబంధన పెట్టడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన అకడమిక్ క్యాలెండర్ ను విద్యాశాఖ అమలు చేయని వింత పరిస్థితి నెలకొందని వారన్నారు. సర్వీస్ లో




ఉన్న సీనియర్ ఉపాధ్యాయులకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ ( టెట్ )నుండి మినహాయింపు ఇవ్వాలని అలాగే ఉపాధ్యాయ, ఉద్యోగులకు 12వ వేతన సవరణ సంఘాన్ని తక్షణమే నియమించి 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సరెండర్ లీవ్ బిల్లులు, పిఎఫ్, ఎపిజిఎల్ఐ, 11వ పిఆర్సీ తదితర ఆర్థిక బకాయిలను చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఏపీటీఎఫ్ నాయకులు టి. గోపాల్ రావు, మల్లెల పుల్లయ్య ,ఆర్. జయరాం, మానపాటి రవి, ఎం. పవన్ కుమార్, ఆవుల మునిస్వామి ,నగిరి వెంకటేశ్వర్లు ,ఎం. ఖలీల్ అహ్మద్, రమణ యాదవ్, జె. హరికుమార్ ,ఎస్. కాసిం సాహెబ్, జె.వై. కృష్ణమూర్తి , ఇ. రామాంజనేయులు,ఎన్. సిహెచ్. మద్దిలేటి, ఎల్. బాలస్వామి,ఎన్. రాంప్రసాద్ ,బి.వెంకటరమణ, విజయ రమేష్, కె. వెంకటరామిరెడ్డి,రమేష్, ఎం. నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు పల్స్ పోలియో తప్పనిసరిగా వేయించండి

**- డాక్టర్ శివశంకరుడు**

**సంజామలమేజర్,న్యూస్ః** జాతీయ పల్స్ పోలియో కార్యక్రమములో భాగంగా శుక్రవారం సంజామల గ్రామంలో విద్యార్థులతో పిహెచ్‌సి డాక్టర్ శివశంకరుడు పల్స్ పోలియోపై ర్యాలీ నిరిర్వహించారు. ఈ సందర్భంగా ఆశాలకు, అంగన్‌వాడీలకు, టీచర్ల సమావేశం ఏర్పాటు చేసి పల్స్ పోలియో కార్యక్రమం ఎలా జరపాలనే విషయాలను వివరిస్తూ ఆదివారం 0 నుండి 5 సంవత్సరాలలోపు పిల్లలకు తప్పకుండా రెండు పోలియో చుక్కలను వేయించాలని వేయించుకోని వారు సోమవారం, మంగళవారం ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.




విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# ఈనెల 21వ తేదీన పల్స్‌పోలియో టీకాకరణ కార్యక్రమం

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్ః** భారత ప్రభుత్వం మరియు జాతీయ పోలియో నిఘా కార్యక్రమం మార్గదర్శకాలకు అనుగుణంగా మండల పరిధిలోని గోవర్ధనగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈనెల 21వ తేది ఆదివారం పల్స్ పోలియో టీకాకరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని గోవర్ధనగిరి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కె.నవీన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21వ తేది ఆదివారాన్ని బూత్‌డేగా నిర్వహించి, మండలంలోని అన్ని పోలియో బూత్‌లలో 0-5 సంవత్సరాల లోపు అర్హులైన పిల్లలకు ఒరల్ పోలియో వ్యాక్సిన్ ఇవ్వబడుతుందన్నారు. బూత్ డే నాడు పోలియో చుక్కలు వేయించుకోలేని పిల్లలను గుర్తించి 22వ తేది సోమవారం, 23వ తేది మంగళవారం ఇంటింటిని సందర్శించి పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాని డాక్టర్ ఎన్.శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడి టీచర్లు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు జరిగేలా ఏర్పాట్లు చేశామన్నారు. కావున పిల్లల తల్లిదండ్రులు వారి పిల్లలను డిసెంబర్ 21వ తేది ఆదివారం నాడు తప్పకుండా పోలియో కేంద్రాలకు చేరుకొని చిన్నారులకు పోలియో చుక్కలను వేయించాలని కోరారు.

# బాల్య వివాహాల వల్ల పిల్లల భవిష్యత్తు నాశనం




పోస్టర్లు విడుదల చేసిన జిల్లా జడ్జి కబర్ధి

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** బాల్య వివాహాలు చేయడం వల్ల పిల్లల భవిష్యత్తు నాశనమవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా జడ్జి జి కబర్ధి, కార్యదర్శి లీలా వెంకట శేషాద్రిలు అన్నారు. బాల్య వివాహ నిర్మూలనకు 100రోజుల జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వారు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి కబర్ధి మాట్లాడుతూ 18సం॥లలోపు పెళ్లి చేసుకుంటే బాలిక ఆరోగ్యం దెబ్బ తినడమే కాకుండా గర్భవతి అయితే గర్భంలోనే శిశువు మరణించే అవకాశం ఉందన్నారు. ఒకవేళ జన్మించినా అంగవైకల్యం లేదా బుద్ధి మాంద్యంతో జన్మించే అవకాశం ఉందన్నారు. బాలల సహాయం కోసం విడుదల చేసిన ఈ పోస్టర్లను జిల్లాలోని ప్రతి స్కూల్ వద్ద ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సదస్సులో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినీలు నైపుణ్యం పెంచుకుని క్రమశిక్షణ అలవరచుకోవాలి

**కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్ :** విద్యార్థినీలు నైపుణ్యం పెంచుకుని క్రమశిక్షణ అలవరచుకోవాలని ఆర్ఐఓ జి లాలేప్ప అన్నారు. శుక్రవారం స్థానిక కెవిఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్‌కళాశాలఅకౌంటింగ్, టాక్సషన్ మరియు ఆఫీస్ అసిస్టెన్స్ గ్రూపుల విద్యార్థినీలకు ఓజెటి సర్టిఫికేట్‌లను ఆర్ఐఓ చేతుల మీదుగా నైస్ కంప్యూటర్ ట్రైనర్ నాగలక్ష్మి, డా. రాయపాటి శ్రీనివాస్‌లు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో వృత్తి విద్యకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభ్యం అవుతాయని, ఇదే సందర్భంగా నైపుణ్యాలను పెంచుకుని క్రమశిక్షణతో సాధన చేయాలని కోరారు. అనంతరం రాయపాటి దంపతులను ఆర్ఐఓ శాలువా కప్పి సన్మానం చేశారు.



సర్టిఫికేట్లను అందచేస్తున్న ఆర్ఐఓ లాలేప్ప

# గ్రామాల్లో ప్రతి ఇంటికి చెత్త బండి వెళ్లాలి



**గోనెగండ్ల, మేజర్‌న్యూస్ :** ప్రతి ఇంటి కి ప్రతి రోజు చెత్త సేకరించే బండి వెళ్లి ఆ ఇంటి నుంచి చెత్తను సేకరించాలని జిల్లా డీఆర్పీసీ రిసోర్స్పుర్సన్ అస్రఫ్ బాషా, పంచాయతీ కార్యదర్శి సతీష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని పలు వీదులలో వారు పర్యటించి ప్రతి రోజు చెత్త సేకరించే బండి మీ ఇంటి కి వస్తుందా లేదా అని మహిళలను అడిగి తెలుసుకఉన్నారు. అలాగే మహిళలకు తడి చెత్తపొడి చెత్తల పై అవగా హన కల్పించారు. అలాగే ఆవీదిల్లోని ప్రతి ఇంటికి తడిచెత్త, పొడిచెత్తల వేసుకునేందుకు గాను రెండు డబ్బాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్పీసీ రిసోర్స్పుర్సన్ మాట్లాడుతూ ప్రతి రోజు పంచాయతీవాహనం ప్రతి ఇంటి కివస్తుందని ఇంట్లోని వారు తడి చెత్తను పొడి చెత్తను వేరుచేసి వాహనంలో వేయాలన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని వారు తెలిపారు. శానిటరిఇన్స్పెక్టర్ మలాంగ్బాషా, సుబాను, అనిల్ పాల్గొన్నారు.

సూర్య

శనివారం | 20 డిసెంబరు 2025

## 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల పట్ల హర్షం



బిర్రుప్రతాప్ రెడ్డి

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం పట్ల పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌ల సంఘం, పంచాయతీరాజ్ చాంబర్ల విజ్ఞప్తి మేరకు 2025-26వ మొదటి విడత 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1026కోట్లు సర్పంచ్‌లకు విడుదల చేసినందుకు సిఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు గ్రామీణ ప్రజల తరపున, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలందరి తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## శ్రీ చౌడేశ్వరీ అమ్మవారికి పల్లకి సేవ

**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్‌:** శుక్రవారం పురస్కరించుకొని ఆలయంలో శ్రీ చౌడేశ్వరీదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో పూజించి పల్లకిపై కూర్చొనబెట్టి, ప్రధాన ఆలయం చుట్టూ పల్లకి సేవను నిర్వహించారు. ఈ పల్లకి సేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈ.ఓ శ్రీనివాస రెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



పల్లకిసేవ దృశ్యం

## సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తాం..ఎమ్మెల్యే అఖిలప్రియ



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణంలోని సద్దాం కాలనీలో శుక్రవారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే పర్యటించి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. మురుగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న కాలనీవాసులతో మాట్లాడారు. గవర్నమెంట్ కాలువను శుభ్రం చేసి వెంటనే సిసి రోడ్డు వేయాలని మున్సిపల్ కమిషనర్ కిషోర్, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ కమిషనర్ పి. కిషోర్, ఆళ్లగడ్డ మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ షేక్ హుస్సేన్ భాష, సోముల రామ శేఖర్ రెడ్డి, వెంకటయ్య, మున్సిపాలిటీ శానిటరీ ఇంచార్జి బాలస్వామి, పాల్గొన్నారు.

## మల్లెల గ్రూప్స్ ఆధ్వర్యంలో 'అందరి క్రిస్మస్' వేడుకలు

**-400 మంది దివ్యాంగులకు, వృద్ధులకు, వితంతువులకు దుస్తులు పంపిణీ**



**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ) రాష్ట్ర కార్యదర్శి, మల్లెల గ్రూప్స్ అధినేత డా. మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు, సతీమణి మల్లెల సునీల ఆల్ ఫ్రెడ్ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణంలో క్రిస్టియన్ రిఫార్మ్ చర్చి (సిఆర్సి)ఆవరణంలో'అందరిక్రిస్మస్'ముందస్తు సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లెల దంపతులు 400 మంది వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు దుస్తులు పంపిణీ చేసి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ రవి తేజ వాక్యోపదేశం చేశారు. నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించినప్పుడే నిజమైన మానవత్వమని, క్రీస్తు బోధనలను అనుసరించి, ఆచరించి , ఆరాధించడమే నిజమైన క్రిస్మస్ అని సందేశం ఇచ్చారు. టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న ప్రసంగిస్తూ డా. మల్లెల ఆల్ ఫ్రెడ్‌రాజు కులమతాలకు అతీతంగా అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. నల్ల జాతీయుల హక్కుల కోసం పోరాడిన నెల్సన్ మండేలా స్ఫూర్తితో... వికలాంగుల హక్కుల కోసం పోరాడిన నల్ల సూర్యుడు ఆల్ ఫ్రెడ్ రాజు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లాల్ కోట ఖదీర్, జమాతే ముస్లిం హిందూ జిల్లా అధ్యక్షులు చాంద్ భాషా, మూమెంట్ ఐడియాల్ యూత్ పట్టణ అధ్యక్షులు ముల్లా ఇస్మాయిల్, దివ్యాంగుల సాధికారిక ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బీసీ నాగరాజు, న్యూ లైఫ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు యు. సామేల్, మల్లెల గ్రూప్స్ సభ్యులు మల్లెల జీవన్ సుశీల్, సుమాల మత్తు, అజిత్ సతీష్, సంఘ పెద్దలు దేవ ప్రసాద్, చిక్కెన్న తదితరులు పాల్గొన్నారు.

## రబీ సాగు కోసం 160 టన్నుల యూరియా సరఫరా



**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** మండలంలోని రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ పరిమితి సంఘం, మన గ్రోమోర్ సెంటర్ల నుంచి ఇప్పటి వరకు రబీ సాగు కోసం 160 టన్నుల యూరియాను రైతులకు అందజేసినట్లు మండల వ్యవసాయ అధికారి అమీరున్నిసా బేగం తెలిపారు. శుక్రవారం మండలంలోని గుమ్మడాపురంలోని సచివాలయం వద్ద తహశీల్దార్ ఉమారాణి, మండల వ్యవసాయ అధికారి అమీరున్నిసా బేగంలు యూరియా పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రైతుకు 1-బి, ఆధార్, వేలిముద్రల సహాయంతో యూరియా అందజేస్తున్నట్లు తెలిపారు. మండలంలో యూరియా కొరత ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రతి సచివాలయం వద్ద రైతులకు యూరియా అందజేస్తున్నట్లు తెలిపారు. యూరియా పంపిణీలో రైతులు సహకారం అందించాలని కోరారు.ఎస్సై జయశేఖర్, వ్యవసాయ అధికారులు,సిబ్బంది, పాల్గొన్నారు.

## వందేళ్ళ ఆర్ఎస్ఎస్ ఉత్సవాలను విజయవంతం చేద్దాం

**- 21న వీధుల్లో హిందూ సమ్మేళనాలు**
**- హిందువులంతా జాగృతం కావాలి**

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** వందేళ్ళ ఆర్ఎస్ఎస్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని హిందువులంతా జాగృతం కావాలని ప్రతి హిందువు భారతదేశ ఉన్నతికి పాటుపడుతూ భారతదేశాన్ని ప్రపంచ దేశాల్లో పతాకాస్థాయికి చేర్చేలా పాటుపడాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్ కల్యాణ మండపంలో హిందూ సమ్మేళన నిర్వహణ సమితి బాలాజీ కాంప్లెక్స్ అధ్యక్షులు శిలివేరు వేణుగోపాల్, కౌన్సిలర్ ఖండే శ్యామ్‌సుందర్ లాల్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 100సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా హిందూ సమ్మేళనం నిర్వహించడం జరుగుతుందన్నారు. బాలాజీ కాంప్లెక్స్‌లో ఈనెల 21వ తేదీన ఆదివారం సాయంత్రం 4గంటలకు హిందూ సమ్మేళన విజయవంతం చేయాలని కోరారు. ప్రతి హిందువు కుటుంబ సమేతంగా రావాలన్నారు. ఈకార్యక్రమానికి శ్రీశ్రీ శివయోగేంద్రనంద స్వామి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. కుటుంబంలోని పెద్దలు, చిన్నారులు, యువకులు, యువతులు అందరూ రావాలని పేర్కొన్నారు.అలాగే గాంధీచౌక్ వద్ద ఉన్న చిత్తులూరు వీధిలో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమ ంలో సురేష్‌బాబు, కశెట్టి చంద్రశేఖర్, చింతలపల్లె వాసు, కటకం శ్యాంప్రసాద్, బాబురావు, పోలయ్య, ప్రసాద్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న హిందూ సమ్మేళన సమితి సభ్యులు

## భగవత్ భక్తితో శాంతి, సుఖసంతోషాలు సాధ్యం

**తిరుమల తిరుపతి దేవస్థానం డాక్టర్ మల్లు వెంకటరెడ్డి**



కార్యక్రమంలో మాట్లాడుతున్న తోటహరికృష్ణ

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్‌:** భగవద్భక్తితో శాంతి, సుఖసంతోషాలతో పాటు చేపట్టిన పనులన్నింటిలో విజయం సాధ్యమౌతుందని, సనాతన ధర్మాన్ని ఆచరిస్తే శాంతి అని, విస్మరిస్తే అశాంతి నెలకొంటుందని, సనాతన ధర్మం అంటే నిత్యం, శాశ్వతం అయని ఆత్మస్వరూపాన్ని తెలుసుకోవడమేనని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వహకులు డాక్టర మల్లు వెంకటరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని మదార్‌పురం గ్రామంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థానముల హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన ధార్మిక, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ధార్మిక సభా కార్యక్రమంలో వారు అనే అధ్యాత్మిక విషయాలను ప్రజలకు, భక్తులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి పర్యావరణ పరిరక్షణ విభాగ్ జిల్లా ప్రముఖ్ తోటహరికృష్ణ, మదార్‌పురం గ్రామ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్వహకులు, మదార్‌పురం సర్పంచ్ భూపాల్‌రెడ్డి, గ్రామపెద్దలు, వైద్యం రామనాయుడు, తోటహరికృష్ణ, హరిసింహనాయుడు, బోగోలు వెంకటరామిరెడ్డి, రామచంద్ర, జనార్ధన్‌రెడ్డి, రంగన్న, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఐడికార్డులు పంపిణీ

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయు లు, సిబ్బంది, విద్యార్థులకు పిఎంఎస్ హెచ్‌ఆర్ఐ పథకంలో భాగంగా ఐడి కార్డులు శుక్రవారం మండల కేంద్రంలో ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమా నికి ఎంఈఓ ఓంకార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐడి కార్డుని ధరించి మీ గుర్తింపును చాటుకోవాలని అలాగే విద్యార్థులందరూ పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో పాసై పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మనోహహర్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



ఐడికార్డులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

## జిల్లాలో 30,416 కిలోమీటర్ల రోడ్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు

**గోనెగండ్ల, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని ప్రతి గ్రామానికి త్వరలో బీటీ రోడ్డు ఏర్పాటు చేసేందుకు గాను ప్రతిపాధనలు తయారు చేసి ప్రభుత్వంకు పంపినట్లు జిల్లా పీఆర్ ఎస్‌ఈ వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో గోనెగండ్ల నుంచి పెద్దమరివీడుకు వెళ్లే రోడ్డు ను పరిశీలించారు మండలంలో ఎన్నెకండ్ల, తిప్పనూరు గ్రామాల కు రోడ్డు పనులకు గాను నిధులు విడుదల అయినట్లు తెలిపారు. ఎక్కడి నుంచి ఎక్కడి వరకు సీసీ రోడ్డు వేయాలి బీటీ రోడ్డు ఎక్కడ వేయాలని అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో దెబ్బతిన్న ప్రతి రోడ్డును పరిశీలించి కొత్త రోడ్డు ఏర్పాటు కు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో బాగంగానే జిల్లాలని ప్రతి గ్రామానికి రోడ్డు వేయనున్నట్లు తెలిపారు. జిల్లా లో 1006 రోడ్డు పనులకు గాను 30,416 కిలోమీటర్ల రోడ్డు ఏర్పాటు కు అందుకు ఎంత నిధులు కావాలో ప్రతిపాధనలు తయారు చేసి ప్రభుత్వంకు పంపావ ఉన్నారు. నిధులు విడుదల అయిన వెంటనే పనులు చేపడతామన్నారు. హర్టికల్చర్ కు విడుదల అయిన నిధులను పీఆర్ కు మళ్లించి పనులు త్వరగా చేపట్టనున్నట్లు తెలిపారు. గోనెగండ్ల నుంచి పెద్దమరివీడు రోడ్డు ఏర్పాటుకు రూ.3.70 కోట్లు, గోనెగండ్ల నుంచి ఎన్నెకండ్ల రోడ్డుకు రూ. 3.2కోట్లు, తిప్పనూరు నుంచి కర్నూలు బళ్లారి రోడ్డు వరకు 2.85 కోట మైలతో రోడ్డు పనులు చేపడతామన్నారు. అలాగే గోనెగండ్లనుంచి పెద్దమరివీడు రోడ్డు ఏర్పాటులో గోనెగండ్ల విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర నుంచి గ్రామం దాటేవరకు సీసీ రోడ్డు వేసి అనంతరం పెద్దమరివీడు వరకు బీటీ రోడ్డు వేయనున్నట్లు ఆయన వివరించారు. పీఆర్డీఈ చంద్రశేఖర్, ఏఈ శంకర్, డిజిటల్ అసిస్టెంట్ నవీన్, ప్రదీప్, వెంకటప్ప, టీడీపీ నాయకులు తిరుపతయ్య నాయుడు పాల్గొన్నారు.



## బీహార్ సీఎం ముస్లీం మహిళ డాక్టర్ బుర్కా తీయడం అమానుషం

**ఆదోని మేజర్ న్యూస్ :**

డాక్టర్ మహిళకు బుర్కా బీహార్ ముఖ్యమంత్రి చేతితో తీయడం అమానుషమని మాజీ ఎంఐఎం అధ్యక్షుడు, జిల్లా మాజీ వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ నథాడ్ ఇస్మాయిల్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ రాజ్యాంగంలో ఏవరి మతాలు వారి దుస్తులను ధరించాలని చట్టం ఉంది. ముస్లీం మహిళలకు బుర్కా తీసే హక్కు ఎవరికి లేదు. భారతదేశంలో ముస్లీం అక్కా చెల్లెళ్ల మనోభావాలకు భంగం కలిగించింది. ప్రపంచంలో ముస్లీం మహిళలు బుర్కా వేయాలని ఖురాన్ ఆదేశించింది. దీనిపై బీహార్ గవర్నర్, రాష్ట్రపతి విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

APPSC,TGPSC UPSC CIVIL SERVICES EXAMS SPECIAL

# భారత దేశంలో స్థానిక ప్రభుత్వాలు

(గత వారం తరువాయి...)

అత్యంత వెనుకబడిన ప్రాంతాలలో ప్రజలు తమ సమస్యలు, అవసరాలను తామే గుర్తించడం, వాటి పరిష్కారానికి అవసరమైన మార్గాలను ఎంచుకొనే స్వేచ్ఛను ఇవ్వడం ద్వారా దేశంలో వినూత్న ఆలోచనలకు పునాదులు వేసినట్లయింది. అమెరికాకు చెందిన ఫోర్డ్ ఫౌండేషన్ సహకారంతో ప్రారంభించిన సాముదాయకాభివృద్ధి కార్యక్రమం గ్రామీణాభివృద్ధికి అత్యంత కీలకమైన వ్యవసాయాభివృద్ధి, నీటి పారుదల, పశు సంపద అభివృద్ధి, కుటీర పరిశ్రమల అభివృద్ధి, గృహ వసతి కల్పన, విద్య, ఆరోగ్యం, స్త్రీ, శిశు సంక్షేమం కోసం వివిధ కార్యక్రమాలను చేపట్టడం జరిగింది.

సాముదాయకాభివృద్ధి కార్యక్రమాన్ని అమలు చేసేందుకుగాను జిల్లాను బ్లాకులుగా విభజించారు. ఒక్కొక్క బ్లాకులో లక్ష జనాభా కలిగిన దాదాపు వంద గ్రామాలు ఉంటాయి. ఒక్కొక్క బ్లాకుకు ఒక బ్లాక్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో (ప్రస్తుతమున్న మండల అభివృద్ధి అధికారికి సమానం) విస్తరణాధికారులను నియమించడం జరిగింది. ఈ అధికారులు గ్రామీణాభివృద్ధికి అవసరమైన ఆధునిక అభివృద్ధిదాయక విధానాల గురించి ప్రజలకు తెలియచేయడం జరుగుతుంది. దీనికిగాను పది గ్రామాలకు ఒకరు చొప్పున ఒక గ్రామ సేవకుని నియమించడం జరిగింది. వీరు ప్రజలతో కలిసి తిరుగుతూ నిపుణులకు ప్రజలకు మధ్య వారధిగా వ్యవహరించడం జరిగింది.

స్వల్ప వ్యవధిలో విస్తృత ప్రాంతంలో సామాజికాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు గాను 1953 అక్టోబర్ 2న జాతీయ విస్తరణ సేవా కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా ప్రవేశపెట్టడం జరిగింది. ఒక విధంగా ఇది సాముదాయకాభివృద్ధి కార్యక్రమాన్ని దేశమంతటా విస్తరింపచేసేందుకు ఉద్దేశించిన పథకం అని చెప్పవచ్చు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణాభివృద్ధికి దోహదంచేసే సేవా కార్యక్రమాలను చేపట్టారు. తద్వారా వ్యవసాయంలో అధిక దిగుబడినిచ్చే వంగడాల వాడకం, నూతన వ్యవసాయ పద్ధతులను అవలంబించడం వంటి పరిజ్ఞానాన్ని గ్రామీణ ప్రజలకు అందజేయడం జరిగింది.

సాముదాయకాభివృద్ధి కార్యక్రమం, జాతీయ మరియు విస్తరణ సేవా కార్యక్రమం గ్రామీణాభివృద్ధికి దోహదపడేందుకు ప్రవేశపెట్టబడినప్పటికీ వివిధ కారణాల వల్ల వాస్తవంలో మాత్రం ఈ కార్యక్రమాలు పూర్తి స్థాయిలో విజయవంతం కాలేకపోయాయి. ముఖ్యంగా స్థానిక ప్రజలు గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన, వాటి అమలులో భాగస్వాములు కాకపోతే అవి విజయవంతం కావని ఈ కార్యక్రమాల అనుభవాల వల్ల వెల్లడయ్యింది.

సాముదాయకాభివృద్ధి కార్యక్రమం మరియు జాతీయ విస్తరణ సేవా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకుగాను తీసుకోవాల్సిన చర్యలను సూచించేదుకు గాను జాతీయ అభివృద్ధి మండలి (NDC) రూపొందించిన ప్రణాళికా విధాన కమిటీ సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వం 1957లో బల్వంత్ రాయ్ మెహతా అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాల అమలు తీరును, వాటి ప్రభావాన్ని అధ్యయనం చేసిన బల్వంత్ రాయ్ కమిటీ గ్రామీణాభివృద్ధిలో స్థానిక సంస్థల పాత్ర అత్యంత కీలకమైనదని సిఫార్సు చేయడం జరిగింది.

సామాజిక సమస్యలను, బాధ్యతలను తాము ఎన్నుకొన్న ప్రజాప్రతినిధులతో స్థానిక సంస్థలు అధికారాలను చలాయిస్తూ వాటిని పర్యవేక్షించ గలిగే స్థాయి, అవకాశం ఉన్నప్పుడే సమాజ వికాస అభివృద్ధి కార్యక్రమాల వాస్తవిక లక్ష్యం నెరవేరుతుందని, అధికారం, బాధ్యత లేకుండా అభివృద్ధి ఒక్కటే ప్రగతిశీలమైంది కాదని అభిప్రాయపడిన బల్వంత్ రాయ్ మెహతా కమిటీ వికేంద్రీకరణ పరిపాలనా యంత్రాంగానికి అనగా స్థానిక సంస్థలకు అవసరమైన అధికారాలను, వనరులను బదలాయించాలని సిఫార్సు చేయడం జరిగింది.

బల్వంత్ రాయ్ మెహతా కమిటీ తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తూ "స్థానిక ఆసక్తులతో ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థలు ఏర్పడి స్థానిక అవసరాలను తీర్చే ఆర్థిక స్థోమతను వాటికి కలిగించగలిగినపుడే గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని, జిల్లా ప్రణాళికా కమిటీలు, బ్లాక్ సలహా సంఘాల స్థానంలో ప్రజాస్వామ్య వికేంద్రీకరణ విధానాన్ని ప్రవేశపెట్టాలని పేర్కొనడం జరిగింది. బల్వంత్ రాయ్ మెహతా కమిటీ సిఫార్సులను 1958లో జాతీయ అభివృద్ధి మండలి ఆమోదించింది. అనంతరం 1959లో స్థానిక ప్రభుత్వాల కేంద్ర స్థాయి మండలిని పంచాయతీ రాజ్ పేరుతో ప్రారంభించి గ్రామీణ స్థానిక ప్రభుత్వాల ఏర్పాటుకు మార్గదర్శక సూత్రాలను రూపొందించడం జరిగింది. గ్రామీణ ప్రజలకు విస్తృత స్థాయిలో పరిపాలనా భాగస్వామ్యాన్ని కల్పించేందుకు, సేవలను విస్తృత పరిచేందుకు అవసరమైన పరిపాలనా యంత్రాంగాన్ని నిర్మించడమే పంచాయతీరాజ్ సంస్థల అంతిమ లక్ష్యం.

**పంచాయతీరాజ్ వ్యవస్థ ఆశయాలు:**

1. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం.
2. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ఆధారంగా పరిపాలనను అందించేందుకు అవసరమైన సంస్థలను రూపొందించడం.
3. సామాజిక, రాజకీయ మార్పుకు సాధనంగా పనిచేయటం.
4. స్థానిక స్థాయిలలో సమీకరణ ప్రక్రియలకు తోడ్పడటం.
5. అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి సంబంధిత ప్రాంతాలలో అమలుచేయడం వంటి ఆశయాల సాధనకుగాను పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటుచేశారు.

బల్వంత్ రాయ్మెహతా కమిటీ మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను సిఫార్సు చేసినప్పటికీ అనేక రాష్ట్రాలలో స్థానిక పరిస్థితుల దృష్ట్యా ఒకే అంచె, (జమ్మూ కాశ్మీర్), రెండు అంచెలు (పంజాబ్, ఒరిస్సా), నాలుగు అంచెలు (పశ్చిమ బెంగాల్), గిరిజన కౌన్సిల్స్ (నాగాలాండ్, మేఘాలయ) వంటి వేర్వేరు స్థాయిలు గల పంచాయితీరాజ్ వ్యవస్థలు నెలకొల్పబడ్డాయి.

దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థ పరిణామ క్రమంలోని మొదటి దశలో (1959-1966) దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో వివిధ అంచెలలో పంచాయితీ సంస్థలు ఏర్పాటు చేయబడగా, రెండవ దశలో (1967-1976), గ్రామీణాభివృద్ధికి వెన్నుముక అయిన వ్యవసాయ అభివృద్ధికి అధిక ప్రాధాన్యతను ఇవ్వడం జరిగింది. దీనికిగాను సమగ్ర వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలను మరియు గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలుగా రూపొందించి గ్రామ స్థాయిలో అమలుచేయడం జరిగింది. మూడవ దశలో (1977-1991) పంచాయతీ రాజ్ సంస్థలలో సంస్థాగత సంస్కరణలు (Institutional Reforms) చేయబడ్డాయి. ఈ దశలోనే పంచాయతీరాజ్ వ్యవస్థను సమగ్రంగా అధ్యయనం చేసి వాటిలోని లోపాలను సవరిస్తూ, నూతన మార్పులు చేపట్టే ఉద్దేశంతో 1977లో నాటి జనతా ప్రభుత్వం అశోక్ మెహతా అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీ పంచాయతీరాజ్ సంస్థల పనితీరును క్షుణ్ణంగా సమీక్షించి అనేక సిఫార్సులతో కూడిన నివేదికను 1978లో కేంద్ర ప్రభుత్వానికి సమర్పించడం జరిగింది.




ప్రణాళిక సంఘం 1985లో గ్రామీణాభివృద్ధి మరియు పేదరిక నిర్మూలన పథకాల అమలుకు అవసరమైన పాలనా ఏర్పాట్లను సమీక్షించేందుకు గాను జి.వి.కె. రావు అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీ పంచాయతీ రాజ్ వ్యవస్థను పునరుద్ధరించి దానిని బలోపేతం చేయగలిగితే గ్రామీణాభివృద్ధి విజయవంతమవుతుందని సిఫార్సు చేయడం జరిగింది. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ప్రాముఖ్యతను గుర్తించిన ఈ కమిటీ రాష్ట్రస్థాయిలోని ప్రణాళికా విధానాలలో కొన్నింటిని జిల్లా ప్రణాళికా విభాగాలకు బదిలీ చేయాలని, జిల్లా అభివృద్ధి కమిషన్ అనే పదవిని కొత్తగా సృష్టించాలని, జిల్లా కలెక్టర్లు పంచాయతీరాజ్ అభివృద్ధి పాలనలో క్రియాశీల పాత్రను కల్పించాలని సిఫార్సు చేయడం జరిగింది.

ప్రజాస్వామ్యం మరియు గ్రామీణాభివృద్ధి కోసం పంచాయతీరాజ్ వ్యవస్థ పునర్ వ్యవస్థీకరణకు సంబంధించి తగిన సిఫార్సులను చేసేందుకు గాను కేంద్ర ప్రభుత్వం 1986లో ఎల్.ఎమ్ సింఘ్వీ అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీ పంచాయతీరాజ్ వ్యవస్థలకు రాజ్యాంగబద్ధత ఉండాలని, గ్రామస్థాయిలో న్యాయ పంచాయతీలను, గ్రామసభలను ఏర్పాటు చేయాలని, గ్రామ పంచాయతీలకు అధిక నిధులివ్వాలని, పంచాయతీ ఎన్నికలు, వాటి రద్దు వివాదాల పరిష్కారానికి గాను ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేయడం జరిగింది.

నాల్గవదశలో (1992 నుండి) అత్యంత కీలకమైన 73వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించి దేశవ్యాప్తంగా పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటును తప్పనిసరిచేస్తూ వాటికి రాజ్యాంగ బద్ధతను కల్పించడం జరిగింది. 1991లో కేంద్ర ప్రభుత్వం 73వ రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టగా 1992 డిసెంబర్ 23న ఈ బిల్లుకు ఆమోదం లభించింది. అనంతరం తగినన్ని రాష్ట్రాల చట్టసభల ఆమోదం కూడా పొందిన తరువాత 1993 ఏప్రిల్ 24 నుండి 73వ రాజ్యాంగ సవరణ చట్టం దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. ఈ సవరణను రాజ్యాంగంలోని 9వ భాగంలోని నిబంధన 243 కింద చేర్చడం జరిగింది. 243, 243ఎ నుండి 243ఓ వరకు గల 16 నిబంధనలలో పంచాయతీరాజ్ వ్యవస్థకు సంబంధించిన అన్ని అంశాలను స్పష్టంగా నిర్వచించడం జరిగింది.

73వ రాజ్యాంగ సవరణ చట్టంలోని 243జి నిబంధన ప్రకారం గ్రామ పంచాయతీల కోసం ప్రత్యేకంగా 11వ షెడ్యూల్ను ఏర్పాటుచేసి దీనిలో పంచాయతీలకు సంబంధించిన 29 అధికారాలు మరియు విధులను చేర్చడం జరిగింది. దీనిలో వ్యవసాయం, భూమి అభివృద్ధి, భూసంస్కరణలు మొదలు పేదరిక నిర్మూలన, కుటుంబ సంక్షేమం వంటి గ్రామీణాభివృద్ధికి తప్పనిసరిగా ఉపయోగపడే అంశాలను చేర్చడం భారతదేశ గ్రామీణాభివృద్ధి చరిత్రలో మరో మైలురాయి అని చెప్పవచ్చు.

ప్రజారోగ్యం - పారిశుద్ధ్యం

1. మానవ వనరుల అభివృద్ధి కార్యాచరణ కమిటీ సభ్యులను ప్రోత్సహించి ప్రజలలో ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం పట్ల అవగాహనను పెంపొందించాలి.
2. వీధుల వారి పారిశుద్ధ్య కమిటీలను ఏర్పాటు చేసి గృహపారిశుద్ధ్యం వ్యక్తిగత పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్మాణం మరియు వినియోగం, క్లోరినేషన్ జరిపిన నీటి వాడకం వంటి అంశాలను ప్రచారం చేసి ప్రజలు వాటిని పాటించే విధంగా చేయాలి.
3. ఆరోగ్య సిబ్బంది ద్వారా అవగాహన సదస్సులను తరుచూ నిర్వహించడం
4. మురికి నీరును రోడ్లపైన వదులుట పై నిషేధం విధించుట
5. మురికి నీటి కాల్వలు జలదారుల పై కట్టడాలను నిషేధించడం
6. ప్రజారోగ్యానికి హాని కలిగించే యంత్రాలతో నడిచే కర్మాగారాల పై నియంత్రణ విధించడం, అవసరమైతే నిషేధించడం
7. కళేబరాల నిర్వహణకు లైసెన్సులిచ్చుట, నియంత్రించుట
8. మెదడువాపు వ్యాధి వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం. దోమలను నిర్మూలించడానికి క్రిమిసంహారక మందులను పిచికారి చేయడం
9. పందులను, కుక్కలను నియంత్రించడం
10. స్మశాన వాటికలను ఏర్పాటుచేయడం, ప్రైవేటు స్మశాన వాటికల రిజిస్ట్రేషన్ లైసెన్సివ్వడం, అధికారిక అనుమతి లేని స్థలాలలో ఖననాన్ని నిషేధించుట.

Dr. P. Harish,
Director
Perfect Academy,
Hyderabad.



# AP/TG TET, DSC స్పెషల్ బయాలజి




## శ్వాసక్రియ

**1. రెస్పైయిర్ అంటే అర్థం ఏమిటి?**
ఎ. పీల్చడం బి. వదలడం
సి. పీల్చడం మరియు వదలడం
డి. ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసాలు

**2. ఊపిరితిత్తుల గురించి సరైన వాక్యాలను గుర్తించండి.**
1. ఇవి స్పాంజి లాగా ఉంటాయి
2. రెండు ఒకే పరిమాణంలో ఉంటాయి
3. ఎడమ ఊపిరితిత్తి కొంచెం చిన్నదిగా ఉంటుంది.
4. ఊపిరితిత్తులను కప్పుతూ ప్లూరా అనే రెండు పొరలుంటాయి.

ఎ. 1,2,3 మాత్రమే బి. 2,3,4 మాత్రమే
సి. 1,3,4 మాత్రమే
డి. పైవి అన్ని సరైనవే

**3. మానవుని ఊపిరితిత్తుల సామర్థ్యం ఎంత?**
ఎ. 5800 లీటర్లు బి. 5800 మి.లీ.
సి. 1200 మి.లీ. డి. 500 మి.లీ.

**4. వాయుగోళాల నుండి రక్త కేశ నాళికలోకి వాయువు మార్పిడి ఏ పద్ధతిలో జరుగుతుంది?**
ఎ. కిణ్వనం బి. విచ్ఛిన్నక్రియ
సి. ద్రవాభిసరణ డి. వ్యాపనం

**5. Respiration అనే పదం Respire అనే ఏ భాష పదం నుండి ఏర్పడింది?**
ఎ. గ్రీకు బి. లాటిన్
సి. ఫ్రెంచ్ డి. జర్మనీ

**6. జాన్ డాపర్ అనే రసాయన శాస్త్రవేత్త రాసిన గ్రంథం?**
ఎ. శరీర ధర్మ శాస్త్రం
బి. మానవ శరీర ధర్మశాస్త్రం
సి. వృక్ష శరీర ధర్మశాస్త్రం
డి. జంతు శరీర ధర్మశాస్త్రం.

**7. ఖర్చయ్యే గాలిని గుర్తించండి?**
ఎ. కార్బన్ డై ఆక్సైడ్($CO_2$) బి. నైట్రోజన్
సి. ఆక్సిజన్ డి. కార్బన్ మోనాక్సైడ్

**8. వాయు గోళాల గురించి సరైన వాక్యాలను గుర్తించండి?**
1. ఇవి ఒకే కణం మందంతో ఉంటాయి
2. ఇవి అనేక కణాలతో మందంగా ఉంటాయి
3. వీటి సంఖ్య చాలా తక్కువ
4. ఇవి అసంఖ్యాకంగా ఉంటాయి.

ఎ. 1 & 2 మాత్రమే బి. 3 & 4 మాత్రమే
సి. 1 & 3 మాత్రమే డి. 1&4 మాత్రమే

**9. సరైన దానిని గుర్తించండి.**
1. $Hb+4O_2 \rightarrow Hb(O_2)_4$ ఊపిరితిత్తులలో
2. $Hb(O_2)_4 \rightarrow Hb+4O_2$ కణజాలాలలో

ఎ. 1 మాత్రమే బి. 2 మాత్రమే
3. 1&2 మాత్రమే 4. 1&2 సరికావు

**10. శ్వాసక్రియ అనేది**
ఎ. జీవ, భౌతిక చర్యల సరళ ప్రక్రియ
బి. జీవ, భౌతిక చర్యల సంక్లిష్ట ప్రక్రియ
సి. జీవ, భౌతిక, రసాయనిక చర్యల సరళ ప్రక్రియ
డి. జీవ, భౌతిక, రసాయనిక చర్యల సంక్లిష్ట ప్రక్రియ

**11. ఉదర వితానం చదునుగా మారినపుడు**
1. ఉరః కుహర ఘన పరిమాణం పెరుగుతుంది.
2. ఉరః కుహర ఘన పరిమాణం తగ్గుతుంది.
3. ఊపిరితిత్తుల లోపలి పీడనం పెరుగుతుంది.
4. ఊపిరితిత్తుల లోపలి పీడనం తగ్గుతుంది.

ఎ. 1&2 సరైనవి బి. 2&3 సరైనవి
సి. 1&4 సరైనవి డి. 2&4 సరైనవి

**12. శ్వాసక్రియ గురించి తెలియని కాలంలో శ్వాసక్రియ అనే పదాన్ని ఏ విధంగా ఉపయోగించేవారు?**
ఎ. వాయు ప్రసార మార్గంగా
బి. ఉష్ణాన్ని ఉత్పత్తి చేసే ప్రక్రియగా
సి. వైద పరిభాష పదంగా డి. పైవన్నీ

**13. సరైన క్రమంలో అమర్చండి**
1. ఊపిరితిత్తులలో వాయుమార్పిడి
2. ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసాలు
3. కణజాలాల్లో వాయుమార్పిడి
4. రక్తం ద్వారా వాయు రవాణా
5. కణ శ్వాసక్రియ

ఎ. 1,2,3,4,5 బి. 5,4,3,2,1
సి. 2,1,3,4,5 డి. 2,1,4,3,5

**14. సరైన వాక్యాన్ని గుర్తించండి.**
1. క్లోరోఫిల్‌లో మెగ్నీషియం అణువు ఉంటుంది.
2. హిమోగ్లోబిన్‌లో ఇనుము ఉంటుంది.

ఎ. 1 మాత్రమే బి. 2 మాత్రమే
సి. 1&2 సరైనవి డి. 1&2 సరికావు




**15. ఊపిరితిత్తులలోనికి గాలి రావడానికి, బయటకు పోవటానికి సహాయపడేదాన్ని గుర్తించండి.**
ఎ. ఛాతీ కండరాలు మాత్రమే
బి. ఉదర వితానం మాత్రమే (డయాఫ్రమ్)
సి. ఎ మరియు బి
డి. ఊపిరితిత్తులు తమంతట తామే గాలిని తీసుకుంటాయి. బయటకు పంపుతాయి.

**16. ఆ కాలంలో పిలువబడ్డ స్థిరమైన వాయువును ఈ కాలంలో ఏమని పిలుస్తున్నాం?**
ఎ. ఆక్సిజన్ బి. ఆర్గాన్
సి. నైట్రోజన్ డి. కార్బన్ డై ఆక్సైడ్

**17. గ్లూకోజ్ ద్రావణంలో ఆక్సిజన్ లభ్యత తక్కువ అయినపుడు నీలిరంగు ద్రావణం ఏ రంగులోకి మారుతుంది?**
ఎ. ఎరుపు బి. పసుపు
సి. నలుపు డి. గులాబి

**18. జతపరచండి**
1. లాక్టోబాసిల్లస్( ) ఎ. $CO_2$+ నీరు+ శక్తి
2. ఈస్ట్ ( ) బి. $C_6H_{12}O_6$
3. జంతువులు () సి. లాక్టిక్ ఆమ్లం+ శక్తి
4. గ్లూకోజ్ ( ) డి. ఇథనాల్+ కార్బన్ డై ఆక్సైడ్ + శక్తి

ఎ. 1-డి, 2-సి, 3-ఎ, 4-బి
బి. 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
సి. 1-సి, 2-డి, 3-ఎ, 4-బి
డి. 1-సి, 2-డి, 3-బి, 4-ఎ

**19. గాలిని వెచ్చచేయడం, గాలికి తేమను కలపడం వంటి ప్రక్రియలు ఇక్కడ జరుగుతాయి.**
ఎ. స్వరపేటిక బి. గ్రసని
సి. వాయునాళం డి. నాశికారంధ్రాలు

**20. కణశక్త్యాగారాలు (పవర్ హౌసెస్ ఆఫ్ ద సెల్) అని ఏ కణాంగాన్ని అంటాం?**
ఎ. హరితరేణువు బి. రైబోసోమ్స్
సి. లైసోజోమ్స్ డి. మైటోకాండ్రియా

**21. జతపరచండి**
1. యమ ( ) ఎ. ధృడమైన శరీరాకృతి పొందడం
2. నియమ ( ) బి. సామాజిక క్రమశిక్షణ పాటించడం
3. ఆసన ( ) సి. శ్వాసక్రియ శక్తిని పెంపొందించుకోవడం
4. ప్రాణాయామ ( ) డి. వ్యక్తిగత క్రమశిక్షణ పాటించడం

ఎ. 1-ఎ,2-బి,3-సి,4-డి
బి. 1-ఎ,2-బి,3-డి,4-సి
సి. 1-బి,2-డి,3-సి,4-ఎ
డి. 1-బి,2-డి,3-ఎ,4-సి

**22. ఈ క్రింది వాటిలో గట్టి పెట్టె వంటి నిర్మాణాన్ని గుర్తించండి.**
ఎ. గ్రసని బి. వాయునాళం
సి. స్వరపేటిక డి. నాసికా కుహరం

**23. అవాయు శ్వాసక్రియ ఎప్పుడు జరుగుతుంది?**
ఎ. ఆక్సిజన్ లేనపుడు
బి. ఆక్సిజన్ తక్కువగా ఉన్నపుడు
సి. ఎ&బి
డి. ఎక్కువ మొత్తంలో ఆక్సిజన్ ఉన్నపుడు

**24. ప్రాణాయామంలో యామ అనగా**
ఎ. వాయువు బి. గాలి
సి. శ్వాస డి. ప్రయాణం

**25. గ్లూకోజ్ ద్రావణానికి ఆక్సిజన్ సరఫరా కాకుండా నిరోధించే ద్రావణాన్ని గుర్తించండి.**
ఎ. డయాజిన్ గ్రీన్ బి. జానన్ గ్రీన్ బి
సి. పారాఫిన్ డి. పొటాషియం హైడ్రాక్సైడ్

**26. ఇథనాల్ ఏ ఉష్ణోగ్రత వద్ద మరుగుతుంది?**
ఎ. 100 డిగ్రీల సెం.గ్రే.
బి. 90 డిగ్రీల సెం.గ్రే. సి. 80 డిగ్రీల సెం.గ్రే.
డి. 70 డిగ్రీల సెం.గ్రే.

**27. ఈ క్రింది దానిని కణం యొక్క ఎనర్జీ కరెన్సీ అని అంటారు.**
ఎ. మైట్రోకాండ్రియా బి. ADP
సి. ATP డి. NADPH

**28. జతపర్చండి**
1. మాంగ్రూవ్ మొక్కలు ( ) ఎ. ప్రత్యేక కణజాలం
2. ఆర్కిడ్ జాతి మొక్కలు ( ) బి. శ్వాసవేర్లు
3. శ్వాసక్రియ ( ) సి. విచ్ఛిన్నక్రియ
4. కిరణజన్యసంయోగక్రియ ( ) డి. నిర్మాణాత్మక క్రియ

ఎ. 1-బి, 2-ఎ, 3-డి, 4-సి
బి. 1-బి, 2-ఎ, 3-సి, 4-డి
సి. 1-ఎ, 2-బి, 3-డి, 4-సి
డి. 1-ఎ, 2-బి, 3-సి, 4-డి

**29. గ్లూకోజ్ ద్రావణంలో ఇంకా ఆక్సిజన్ ఉన్నదో లేదో తెలుసుకోవాలంటే ఏ ద్రావణాన్ని ఉపయోగించాలి?**
ఎ. డయాజిన్ గ్రీన్ బి. జానస్ గ్రీన్ బి
సి. ఎ (లేదా) బి డి. పారాఫిన్ ద్రావణం

**30. ఈస్టులో అవాయు శ్వాసక్రియ ద్వారా గ్లూకోజ్ నుండి ఏర్పడే అంత్య పదార్థాలు**
ఎ. లాక్టిక్ ఆమ్లం, శక్తి
బి. ఇథనాల్, కార్బన్ డై ఆక్సైడ్, శక్తి
సి. కార్బన్ డై ఆక్సైడ్, నీరు, శక్తి
డి. ఇథనాల్, శక్తి

**31. జతపరచండి**
1. వాయునాళాలు ( ) ఎ. చేపలు
2. మొప్పలు ( ) బి. కప్ప
3. ఊపిరితిత్తులు ( ) సి. కీటకాలు
4. చర్మం/ఆస్యగ్రసని/ ఊపిరితిత్తులు ( ) డి. సరీసృపాలు

ఎ. 1-సి, 2-ఎ, 3-డి, 4-బి
బి. 1-సి, 2-ఎ, 3-బి, 4-డి
సి. 1-డి, 2-ఎ, 3-సి, 4-బి
డి. 1-సి, 2-బి, 3-ఎ, 4-డి

**32. ప్రతి ATP లో ఎన్ని కేలరీల శక్తి నిల్వ ఉంటుంది?**
ఎ. 7000 కేలరీలు బి. 7100 కేలరీలు
సి. 7200 కేలరీలు డి. 7300 కేలరీలు

**33. వాయువు ఇక్కడ వడబోయబడుతుంది.**
ఎ. నాసికారంధ్రాలు బి. నాసికా కుహరం
సి. గ్రసని డి. స్వరపేటిక

**34. చక్కెర ఈస్ట్ ద్రావణం నుండి ఏ ప్రక్రియ ద్వారా ఇథనాల్‌ను వేరు చేయవచ్చు?**
ఎ. ద్రవాభిసరణ (ఓస్మాసిస్) బి. విసరణ
సి. అంశికస్వేదనం డి. విచ్ఛిన్నప్రక్రియ

**35. పతంజలి మహర్షి యోగాభ్యాస ప్రక్రియలో ఎన్ని విభాగాలలో ఎన్ని నియమాలను ప్రవేశపెట్టాడు?**
ఎ. 6 విభాగాలలో 197 నియమాలు
బి. 4 విభాగాలలో 195 నియమాలు
సి. 8 విభాగాలలో 196 నియమాలు
డి. 8 విభాగాలలో 195 నియమాలు

**36. తీవ్రమయిన వ్యాయామం చేసిన తర్వాత మన కండరాలు నొప్పికి దారి తీస్తాయి. ఈ నొప్పికి కారణం**
ఎ. సిట్రిక్ ఆమ్లం బి. బోరిక్ ఆమ్లం
సి. లాక్టిక్ ఆమ్లం డి. సల్ఫ్యూరిక్ ఆమ్లం.

**జవాబులు :**
1)ఎ, 2)సి, 3)బి, 4)డి, 5)బి, 6)బి, 7)సి, 8)డి, 9)సి, 10)డి, 11)సి, 12)డి, 13)డి, 14)సి, 15)సి, 16)డి, 17)డి, 18)సి, 19)బి, 20)డి, 21)డి, 22)సి, 23)సి, 24)డి, 25)సి, 26)డి, 27)సి, 28)బి, 29)సి, 30)బి, 31)ఎ, 32)సి, 33)బి, 34)సి, 35)డి, 36)సి



చకినారపు
సతీష్ కుమార్,
సీనియర్ ఫ్యాకల్టీ

## బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించిన ఐఎంఏ మహిళా వైద్య విభాగం

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** నంద్యాల ఐఎంఏ మహిళా వైద్య విభాగం ఆధ్వర్యంలో ఫరూక్ నగర్ లో ఉన్న శ్రీ శారదా విద్యా పీఠం ఉన్నత పాఠశాల బాలికలకు వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నంద్యాల ఐఎంఏ మహిళా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి మంచి విద్యార్థి లక్షణాల గురించి, మహిళా వైద్య విభాగం కార్యదర్శి, గైనకాలజిస్ట్ డాక్టర్ సునీత నెల వారి ఋతు క్రమ సమయంలో తీసుకోవలసిన శుభ్రత గురించి, మహిళా వైద్య విభాగం నిర్వాహక కార్యదర్శి గైనకాలజిస్ట్ డాక్టర్ రాధిక మంచి స్పర్శ, చెడు స్పర్శ లపై, రజస్వల అయిన సమయంలో శరీరంలోవచ్చే మార్పుల గురించి, మహిళా వైద్య విభాగం కార్యవర్గ సభ్యురాలు న్యూరాలజిస్ట్ డాక్టర్ భారతి విద్యార్థులపై మొబైల్, సోషల్ మీడియా ప్రభావం గురించి, ఐఎంఏ నంద్యాల అకాడమిక్ విభాగం కార్యదర్శి డాక్టర్ లలిత మానసిక ఒత్తిడిని అధిగమించడం అన్న అంశంపై, డాక్టర్ అరుణ కుమారి నీతి కథలతో బాలికలకు అవగాహన కల్పించారు. డాక్టర్ మాధవి మాట్లాడుతూ నంద్యాల ఐఎంఏ మహిళా వైద్య విభాగం సామాజిక బాధ్యతలో భాగంగా, "కేర్ బియాండ్ క్లినిక్స్" ( క్లినిక్‌లు దాటి సంరక్షణ) అనే పథకం చేపట్టి విద్యా సంస్థలలో వైద్య శిబిరాలు, వివిధ అంశాలపై అవగాహన సదస్సులు ఏడాది పాటు నిర్వహిస్తామని అన్నారు. వైద్యులతో పాటు పాఠశాల ప్రధానాచార్యులు వెంకటకృష్ణ, పాఠశాల కమిటీ సభ్యులు వసుంధరా దేవి, విద్యార్థి నులు పాల్గొన్నారు.




## టీడీపీ ఆధ్వర్యంలో పిల్లిగుండ్లలో ఉచిత వైద్యశిబిరం



**గోనెగండ్ల, మేజర్‌న్యూస్ :** నిరుపేదల కోసమే పిల్లిగుండ్ల గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో గౌరిగోపాల్ హాస్పిటల్ వైద్యుల సహకారంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు మండల టీడీపీ కన్వీనర్ తిరపతయ్యనాయుడు తెలిపారు. శుక్రవారం మండలంలోని పిల్లగుండ్ల గ్రామంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో క్యాన్సర్, బీపీ, షుగర్, గుండెనొప్పి, వంటి రోగాలతో బాధపడుతున్న నిరుపేద రోగులకు వైద్యులు పరీక్షించారు. ఉచితంగా మందులు అందజేశారు. అలాగే ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వార ఉచితంగా వైద్య చేయించుకోవచ్చునని రోగులకు వైద్యులు తెలిపారు. గ్రామంలో పలువురు పేదలు ఈ వైద్యశిబిరంకు హాజరయ్యారు. క్లస్టర్ ఇన్చార్జి నజీర్సాహెబ్, ప్రధాన కార్యదర్శి రమణచౌదరి. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే స్ఫూర్తితో అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

**ఆదోని రూరల్, మేజర్‌న్యూస్ :** ఆదోని మండల పరిధిలోని పెద్దతుంబళం గ్రామం నందు వైఎస్సార్సిపి కాంట్రాక్టర్ బసవరాజు మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి స్ఫూర్తితో గ్రామంలో దాసరి మాదిగ హనుమంతమ్మ, ఇబ్రహీం పూరం మారెమ్మ వారి కుటుంబా లను పరామర్శించి వారి మృతదేహాలకు ఒక్కొక్కరికి రూ. 5వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఇందులో వైఎస్సార్సిపి ఒకటవ వార్డు మెంబర్ మొహమ్మద్, కోసిగి రామిరెడ్డి, కొండాపురం, రామారెడ్డి, తలారి రామదాసు, బొంపల్లి, ఈరన్న, కోసిగి చిన్న, ఉన్నారు.



## గంగావతి నగర్‌లో చోరీ

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని ముజఫర్‌నగర్ దగ్గరలో ఉన్న గంగావతి నగర్‌లో శుక్రవారం చోరీ జరిగినట్లు నాల్గవ పట్టణ పోలీసులు తెలిపారు. వివరాల మేరకు ఇలా వున్నాయి. గంగావతి నగర్‌లో ఉప్పరి లక్ష్మన్న, ఉప్పరి స్రవంతిలు నివాసముంటున్నారు. శుక్రవారం మధ్యాహ్న ఉప్పరి స్రవంతి గోబి తీసుకొచ్చుకునేందుకు రోడ్డుపైకి ఇంటికి తాళం వేయకుండా రావడంతో అక్కడే కాపు కాచిన దొంగలు ఇంటి తలుపులు తెరిచి ఇంట్లో బీరువాలో ఉన్న బంగారు నగలు దాదాపు 6తులాలు, రూ. 50వేలు నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు స్రవంతి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వెంటనే ఆమె ఇంటి వద్దకు పోలీసులు వెళ్లి దొంగతనం జరిగిన విధానాన్ని పరిశీలించి చుట్టుపక్కల వారిని విచారించి ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

**హొళగుంద, మేజర్‌న్యూస్‌:**

రాబోయే స్థానిక సర్పంచ్, ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల్లో వైసీపీ పార్టీ సత్తా చాటాలని ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామక్రిష్ణారెడ్డి చెప్పారని జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కె గిరి అన్నారు. విజయవాడలో శుక్రవారం రాష్ట్ర సదస్సు కార్య క్రమంలో ఆయనను కలిశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కూటమి ప్రభుత్వంపై ప్రజలు అప్పుడే వేతిరేకంగా ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం అప్పులు చేసిందని తెదేపా నాయకులు జోబిలను నింపుకుంటున్నారని విమర్శించారు..



## సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిధి

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** మండలంలో వేల్పనూరు గ్రామంలోని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తన స్వగృహంలో నియోజకవర్గానికి చెందిన 32 మంది సిఎం సహాయ నిధి లబ్ధిదారులకు రూ. 15 లక్షల విలువ గల చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. వైద్య పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు ఎమ్మెల్యే సూచించారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సిఎం సహాయ నిధి మంజూరు చేస్తున్నామని తెలిపారు.



# కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

(మొదటి పేజి తరువాయి)


సభ వాయిదా వేయాలని కోరుతున్న వైసిపి కార్పొరేటర్లు


అడిషనల్ కమీషనర్‌తో మేయర్ బివై రామయ్య


చర్చిద్దాం రండి అని పిలుస్తున్న మేయర్

ఆమోదించాల్సిన కార్పొరేటర్ల సర్వసభ్య సాధారణ సమావేశం రసాభసాతో పాటు వైసిపి కార్పొరేటర్లు బహిష్కరించడంతో శుక్రవారం జరిగిన సభ మేయర్ బివై రామయ్య కోరం లేకపోవడంతో వాయిదా వేశారు. ఉదయం 11గంటలకు ప్రారంభం కావాల్సిన సర్వసభ్య సమావేశం 11.30గం టలైనా పూర్తిస్థాయిలో సభ్యులు రాకపోగా ఉన్న వైసిపి 30మంది సభ్యులు కమీషనర్ అందుబాటులో లేని కారణంగా సభ వాయిదా వేయాలని సభ ప్రారంభంలోనే సభాధ్యక్షుడు బివై రామయ్యకు అల్టిమేటం జారీ చేశారు. అయితే వారి వాదనలను పట్టించుకోకుండా అన్ని విషయాలు చర్చించి సభను కొనసాగిద్దామనడంతో వైసిపి కార్పొరేటర్లు కమీషనర్ లేకుండా సభను ఎలా కొనసాగిస్తారు..దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని..గత సమావేశంలో చేసిన అజెండానే పూర్తిగా అమలు కాకపోయినా మళ్లీ సమావేశం ఎందుకని మేయర్‌పై కార్పొరేటర్లు మండిపడ్డారు. నగర అభివృద్ధి కోసం సమావేశంలో 12అంశాలపై చర్చించి ఆమోదించాల్సిఉండగా వాయిదా పడడంతో పలు అభివృద్ధి పనులకు బ్రేక్ పడినట్లయింది. మొదటి నుంచి వైసిపి కార్పొరేటర్లు విక్రమసింహారెడ్డి, లక్ష్మీపురం కార్పొరేటర్ నారాయణరెడ్డి, లక్ష్మీకాంత రెడ్డి, నరసింహు లు ఆధ్వర్యంలో మేయర్ వైసిపి తరుపున గెలిచి టిడిపి కార్పొరేటర్లకు సపోర్టు చేసే విధంగా సభను నిర్వహించాలనుకోవడంతో మేయర్ చాంబర్‌పైకి ఎక్కి వైసిపి సభ్యులు అతనిని వాయిదా వేయాలని నిలదీశారు. దీంతో కూటమి కార్పొరేటర్లు క్రాంతికుమా ర్, ఫరాజ్‌ఖాన్, పరమేష్‌ల ఆధ్వర్యంలో వైసిపి కార్పొరేటర్లపై ఎదురుదాడికి దిగారు. కూటమి కార్పొరేటర్లు కనీసం 18మంది సభ్యులుంటే సభను కొనసాగించేందుకు సిద్ధమేనని మేయర్ చెప్పడంతో దానిని కూడా వైసిపి కార్పొరేటర్లు వ్యతిరేకించారు. కార్పొరేషన్‌లో 51మంది కార్పొరేటర్లలో 30మంది వైసిపి, 21మంది కూటమి సభ్యులు హాజరు కావాల్సి ఉంది. అయితే 11.30గంటలైనా కూటమి తరపున కేవలం 11మంది మాత్రమే హాజరయ్యారు. అందు లో కూడా ముగ్గురు కార్పొరేటర్లు వైసిపి తరపున గెలిచి కూటమిలో చేరిన వారే ఉన్నారు. మధ్యాహ్నం 12గంటల సమయం లో కూటమి కార్పొరేటర్లు 18మంది మా తరుపున ఉన్నారని చెప్పడంతో మేయర్ ఎంతమంది ఉన్నారని అడిషనల్ కమీషన ర్‌కు చెప్పి లెక్కించగా కేవలం 11మంది సభ్యులు మాత్రమే ఉండడంతో కోరం లేదని సభను వాయిదా వేశారు.

**నగర అభివృద్ధిని అడ్డుకుంటున్న వైసిపి : టిడిపి కార్పొరేటర్లు :** నగర అభివృద్ధి కోసం మంత్రి టీజీ భరత్ ఎంతో కృషి చేస్తుంటే అభివృద్ధిని అడ్డుకునేందుకే వైసిపి కార్పొరేట ర్లు సభను వాయిదా వేయాలని అడ్డుకోవ డం నగర అభివృద్ధిని అడ్డుకోవడమేనని, త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రజలు వైసిపి నాయకులను గెలవ కుండా అడ్డుకుని తగిన గుణపాఠం చెబుతా రని టిడిపి వారు వైసిపి వారిపై మండిపడ్డా రు. దీంతో కొంతసేపు ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది.

**అజెండాలో ఉన్న వాటిని ఆమోదిస్తే..ఎవరు అమలు పరుస్తారు.. వైసిపి కార్పొరేటర్లు :** కమీషనర్ లేకుండా అజెండాలో ఉన్న వాటిని సభలో చర్చించి ఆమోదిస్తే వాటిని ఎవరు అమలు పరుస్తారని టిడిపి కార్పొరేట ర్లపై వైసిపి కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కమీషనర్ వచ్చిన తర్వాతనే చర్చిం చి ఆమోదిస్తామని ప్రస్తుతానికి వాయిదా వేయాలని కోరారు. టిడిపి కార్పొరేటర్లు కోరం లేకపోయినా దొడ్డిదారిన అజెండాను ఆమోదించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నా రని ఇది చట్టవిరుద్ధమని, ఎక్కడ ఈ జీఓ లేదని పట్టుబట్టారు. దీంతో సభ పూర్తిస్థాయి లో వాయిదా పడింది.

**సభకు భారీ బందోబస్తు :** సభను సజావుగా సాగకుండా కార్పొరేటర్లు, వర్కర్లు అడ్డుకుం టారన్న సమాచారంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమకు సకాలంలో జీతాలు అందకపోవడం, రిటైర్డ్ అయినా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పూర్తిస్థాయిలో రాకపోవడం, 60సం॥లు దాటాయని కొంతమందిని తొలగించి తమ కడుపులు కొడుతున్నారని డ్వాక్రా గ్రూపు మహిళా శానిటరీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు సభ ప్రాంగణం వద్ద ఆందోళనకు దిగారు. దీంతో టుటౌన్ పోలీసులు వారిని నిలువరించి సభకు ఎలాంటి ఆటంకం జరుగకుండా చూశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మున్సిపల్ ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.


సభ జరపాలని పట్టుబడుతున్న టిడిపి కార్పొరేటర్లు


మున్సిపల్ వర్కర్ల ఆందోళన


గందరగోళ సభ ను పరిశీలిస్తున్న మేయర్

# అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :**

మండల పరిధిలోని కొండుపల్లె గ్రామానికి చెందిన సిద్దంరెడ్డి రామచంద్రా రెడ్డి (50) అనే కౌలు రైతు పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఉయ్యాలవాడ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బుచ్చన్న తెలిపారు. వారి వివరాల మేరకు రామచంద్రా రెడ్డి గత కొద్ది సంవత్సరాలుగా 20 ఎకరాల పొలంను కౌలుకు తీసుకుని మిరప, సీడుపత్తి పంటలు సాగుచేసాడు. అయితే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు సరిగ్గా పండక సుమారు రూ.15 లక్షలు మేరా అప్పులు అయ్యాయి. అప్పులు తీర్చే మార్గం కానరాకపోవడంతో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## జిల్లా పోలీసులకు రాష్ట్ర స్థాయి (ఏబిసిడి) అవార్డులు

**:- డిజిపి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కర్నూలు పోలీసులు**


డిజిపి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా కీలక కేసుల దర్యాప్తులో అత్యుత్తమ ప్రతిభ కనబరచడాన్ని గుర్తించి ప్రతిష్ఠాత్మకంగా ప్రతి మూడు నెలలకోసారి ప్రకటించే అవార్డు ఫర్ బెస్ట్ ఇన్ క్రైం డిటెక్షన్ (ఏబిసిడి) అవార్డును కర్నూలు జిల్లా పోలీసులు డిజిపి హరీష్ కుమార్ గుప్తా చేతుల మీదుగా అందుకున్నారు. మొదటి క్వార్టర్ (జనవవరి టు మార్చి) 2025కు గాను ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఏటిఎం దొంగతనం కేసును చేధించినందుకు కర్నూలు జిల్లా పోలీసు విభాగం ఎంపికైంది. దీంతో శుక్రవారం మంగళగిరిలోని డిజిపి ప్రధాన పోలీసు కార్యాలయంలో డిజిపి హరీష్ కుమార్ గుప్తా చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అవార్డు పొందిన వారిలో కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, డిఎస్పీ జె బాబు ప్రసాద్,రూరల్ సిఐ చంద్రబాబునాయుడు, ఉలిందకొండ, ఓర్వకల్లు ఎస్ఐలు ధనుంజయ, సునీల్‌లు వున్నారు.

# కాంట్రాక్ట్ ఉద్యోగాల కొనసాగింపు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులను యధావిధిగా కొనసాగించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏపీ మెడికల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులు 50 సంవత్సరాలు పైబడిన వారిని ఉద్యోగం నుంచి తొలగించడంపై యూనియన్ పోరాట ఫలితంగా హైకోర్టు స్టేతస్కో ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఏఐటియుసి జిల్లా నాయకులు మురళీధర్, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు నంద్యాలలో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుశీలమ్మ, తులసమ్మ, రవణమ్మ, హరిప్రియ, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

## సుపరిపాలన వారోత్సవాలు-మండలాల్లో ఫిర్యాదుల డెస్కులు

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 19 నుండి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్న గుడ్ గవర్నెన్స్ వీక్-2025(సుశాసన్ సప్తాహ్-ప్రశాసన్ గావోంకి ఓర్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలో సుపరిపాలన వారోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ క్యాంపెయిన్ ముఖ్య ఉద్దేశ్యం మంచి పరిపాలనను బలోపేతం చేయడం, ప్రజా ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరించడం, సేవా డెలివరీని మెరుగుపరచడం, జిల్లా, గ్రామీణ స్థాయిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం అని కలెక్టర్ డా.ఏ సిరి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని కలెక్టరేట్, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, అన్ని మండల కార్యాలయాల్లో ప్రజల ఫిర్యాదులను స్వీకరించేందుకు ప్రత్యేక డెస్కులు ఏర్పాటు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. తహసీల్ హెడ్ క్వార్టర్స్, పంచాయతీ సమితుల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి, ఫిర్యాదుల పరిష్కారం , ప్రజా కేంద్రిక సేవలను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 23న జిల్లా స్థాయిలో వర్క్‌షాపులు నిర్వహించి, మంచి పరిపాలన పద్ధతులను డాక్యుమెంట్ చేసి పోర్టల్‌లో షేర్ చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను నమోదు చేసి పరిష్కారం పొందాలని డా.ఏ సిరి విజ్ఞప్తి చేశారు.

## పోలియో రహిత సమాజమే మనందరి లక్ష్యం

**మహానంది, మేజర్‌న్యూస్ :** భారత దేశం నుంచి పోలియో మహమ్మారిని పారద్రోలి పోలియో రహిత భారత దేశంగా తీర్చిదిద్దడమే మనందరి బాధ్యత అని ఎంపీహెచ్ఈఓ హుస్సేన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మహానంది గ్రామంలో ఈ నెల 21న ఆదివారం నిర్వహించబోయే పల్స్ పోలియో కార్యక్రమంపై గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేతబట్టుకుని నినాదాలు చేస్తూ మహానంది గ్రామంలో విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాల్లోపు ప్రతి చిన్నారికి రెండు పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. పోలియో చుక్కలు వేయించడం వల్ల ఆ బిడ్డ పోలియో రాకుండా సురక్షితంగా పెరుగుతారని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సునీత, మహాలక్ష్మీ, హెచ్‌వీం సత్యాలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


మహానంది గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# 3న శ్రీ హనుమత్ ధర్మజ్యోతి మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

**:- ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి**

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో జనవరి 3న పౌర్ణమిరోజు దిన్నెదేవరపాడు శివారులోని రూపాల సంగమేశ్వర స్వామి జగన్నాథ గట్టు వద్ద వెలసిన 67అడుగుల శ్రీ అభయ ఆంజనేయస్వామి విగ్రహ సమీపంలో జరిగే శ్రీ హనుమత్ ధర్మజ్యోతి మహోత్సవానికి భక్తులందరు సమైక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. అమావాస్య సందర్భంగా శుక్రవారం శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద నిర్వహించిన అభిషేక అర్చనలు, మన్యసూక్త హోమం విశేష పూజలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జనవరి 3న జరిగే శ్రీ హనుమత్ ధర్మజ్యోతి ప్రచార పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూపాల సంగమేశ్వర జగన్నాథ గట్టు అభివృద్ధికి ప్రభుత్వ సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. లోక కళ్యాణార్థం, ధర్మరక్షణకు నిర్వహిస్తున్న ఈ మహోత్సవానికి మరియు రూపాల సంగమేశ్వర స్వామి జగన్నాథ గట్టు అభివృద్ధికి ప్రభుత్వం తరుపున పూర్తి సహాయ, సహకారాలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రమణ్య స్వామి, కోట ఆంజనేయస్వామి వ్యవస్థాపక ట్రస్ట్ సభ్యులు కందాల రామాచార్యులు పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశ హితం, లోక కళ్యాణం, పంటల సమృద్ధి, ప్రజలలో దేశభక్తి-దైవభక్తి పెంపొందాలనే మహాసంకల్పంతో నిర్వహిస్తున్న శ్రీ హనుమత్ ధర్మ జ్యోతి మహోత్సవం అపూర్వంగా సాగాలని ఆశీర్వదించారు. విహెచ్‌పి విశేష సంపర్క విభాగం రాష్ట్ర ప్రముఖ తుంకుంట ప్రతాపరెడ్డి మాట్లాడుతూ జిల్లా పుల్లారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జి రాఘవరెడ్డి తమ సొంత నిధులతో నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద ప్రతి పౌర్ణమి నాడు అభిషేక అర్చనలు, మన్యసూక్త హోమం, సామూహిక హనుమాన్ చాలీసా అనంతరం శ్రీ హనుమత్ ధర్మజ్యోతి ఉత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మ, వీరశైవ లింగాయత్ సమాజ్ రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు రామాంజనేయులు, విహెచ్‌పి నాయకులు శివకోటి, చంద్రశేఖర్, సంగురాంబాబు, భజరంగదళ్ నాయకులు శివసాయినాథ్, గుజరాతి సురేష్, వడ్డే రాము, ఉప్పర రాజశేఖర్, నరసింహారెడ్డి, యశ్వంత్, ఫణింద్ర, అర్జున్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

# జిల్లా కలెక్టర్.. ఎస్పీ ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన అధికారులు

- చాక్లెట్ల కలకలం పై స్పందించిన అధికారులు.
- చాక్లెట్లను టెస్టింగ్ కు పంపించాం..
- తహశీల్దార్.. పట్టణ సీఐ.. ఫుడ్ సేఫ్టీ అధికారులు వెల్లడి

**నందికొట్కూరు రూరల్ మేజర్ న్యూస్ :** పట్టణంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చాక్లెట్ల కలకలంపై జిల్లా కలెక్టర్.. జిల్లా ఎస్పీ స్పందించి స్థానిక అధికారులను ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా దర్యాప్తు చేసి నివేదిక సమర్పించాలని శుక్రవారం ఆదేశాలు జారీ చేయడంతో స్థానిక తహశీల్దార్ శ్రీనివాసులు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఖాసిం వలి, వెంకట్రాముడు లు జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి విద్యార్థినీలను మరియు ఉపాధ్యాయులను విచారించడం జరిగింది. చాక్లెట్ తిన్నా విద్యార్థినీలను విచారించగా పాఠశాల సమీపంలో ఉన్న సాయి దుకాణంలో చాక్లెట్లు కొనుగోలు చేసినట్లు తెలపడంతో దుకాణం యజమానిని పిలిపించి విచారించడం చేపట్టడం జరిగింది. దుకాణంలో విద్యార్థినీలు కొనుగోలు చేసి తిన్నా చాక్లెట్లకు గడువు ఉందని విద్యార్థిని తిన్న చాక్లెట్ తో వాటిని పోలిస్తే ఒకటిగా ఉన్నట్లు తేలిందన్నారు. అలాగే మధ్యాహ్న భోజనం ను తనిఖీలో భాగంగా అధికారులు స్వయంగా రుచి చూశామన్నారు. విద్యార్థినీలు కొనుగోలు చేసి తిన్న చాక్లెట్ల వలన ఎలాంటి ఫుడ్ పాయిజన్ జరగలేదన్నారు అయినప్పటికీ చాక్లెట్లను సీజ్ చేసి టెస్టింగ్ ల్యాబ్ కు పంపించడం జరిగిందన్నారు. పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థినీని తల్లిదండ్రులను విచారించగా తమ బాలికకు ఫిట్స్ వచ్చేవని ప్రస్తుతం అదే జరిగిందని అధికారులకు తల్లిదండ్రులు తెలిపారు. పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయు రాలిగా పని చేస్తున్న టీచర్ అస్వస్థతకు గురైందన్న విషయం అవాస్తవమని ఆమెకు గ్యాస్ సమస్యతో అనారోగ్యానికి గురైందన్నారు. ఈ సంఘటనపై నివేదిక రాగానే స్థానిక పోలీసులు పూర్తిస్థాయివిచారణచేపడతారని తెలిపారు.





# అమావాస్య..రైల్వేగేటు కష్టాలు

- మొరాయించిన రైల్వేగేటు - భక్తులు, వాహనదారులకు నరకం
- ఎక్కడి వాహనాలు అక్కడే బంద్ - లబోదిబో మంటున్న ప్రజలు


ఒకగేటు మొరాయించడంతో రెండవగేటు వేసిన దృశ్యం

**కోసిగి మేజర్ న్యూస్:** నెలకోసారి వచ్చే పవిత్రమైన అమావాస్య రోజున దేవుడి దగ్గరకో, చనిపోయినవారి దగ్గరకెళ్ళి పూజలు వంటివి చేసుకొని ప్రశాంతంగా ఉండాలని బయలుదేరితే రైల్వేగేటు వల్ల అమావాస్యరోజు రైల్వేకష్టాలు కోసిగి ప్రజలకు తప్పేటట్లు లేదు. శుక్రవారం రైల్వేగేటు మొరాయించడంతో దాదాపుగా గంటన్నరకు పైగా మొరాయించడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. దీనికితోడు అమవాస్య కావడంతో ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయానికి పెద్దఎత్తున తెలంగాణ, కర్ణాటక, ఆంధ్ర నుంచి వాహనాలు స్కూటర్లు, జీపుల్లోను కోసిగి మీదుగా రావడం జరుగుతుంది. అయితే దేవునిదగ్గర ప్రశాంతంగా ఉండాలని కుటుంబ సమేతంగా వస్తే ఈ రైల్వేగేటు సాంకేతికలోపంతో నిలిచిపోవడంతో భక్తులు, ప్రజల కష్టాలు వర్ణాతీతంగా చెప్పవచ్చు. ఈ రైల్వేగేటు సమస్య ప్రతిరోజు ఓ పెద్దసమస్యగా మారి దినదినగండంగా మారింది. అమావాస్యరోజుతోపాటు మామూలు రోజుల్లో అంబులెన్సుల్లో గర్భవతులు ప్రమాదవశాత్తు అనారోగ్యానికి గురైనవారి పరిస్థితి దారుణమని చెప్పవచ్చు. కొన్ని సందర్భాలలో అంబులెన్సల్లోను, రోడ్డుమీదే కాన్పులు జరిగాయని ప్రజలు వాపోతున్నారు. కొంతమంది ప్రాణాలు కూడా పోయాయని అయినా కూడా రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఎక్కడో ఐరనగల్ స్టేషన్‌దగ్గర ట్రాఫిక్ సమస్య లేకున్నా.. లక్షలాది రూపాయలతో బ్రిడ్జి చేపడుతున్నారని కోసిగిలో ప్రధాన సమస్యగా ఉన్న రైల్వేగేటు బ్రిడ్జిమాత్రం రైల్వే అధికారులు చేపట్టడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి బ్రిడ్జి ఏర్పాటుచేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.


బ్రిడ్జికింద దూరివెళుతున్న వాహనదారులు